Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 187 మేడ్చల్ మల్కాజ్‌గిరి 28 జూలై 2023 శుక్రవారం పేజీలు : 4

## 'అమర్‌నాథ్ యాత్ర'పై ఉగ్ర కుట్ర.. రహస్య సొరంగం గుర్తింపు

జమ్మూ: త్వరలోనే జరగబోయే వార్షిక అమరనాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు చేసిన కుట్రను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సిబ్బంది భగ్నం చేశారు. జమ్మూ కశ్మీర్‌లో అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఓ రహస్య సొరంగాన్ని గుర్తించారు. సాంబా జిల్లాలోని చాక్ ఫఖీరా బోర్డర్ అవుట్‌పోస్ట్‌కు సమీపంలోని 150 మీ టర్ల సొరంగం ఉన్నట్లు గుర్తించామని బీఎస్ ఎఫ్ అధికారులు వెల్లడించారు. ఈ సొరంగాన్ని ఇటీవలే తవ్వారని, పాక్ భూభాగం నుంచే ఈ సొరంగం ఉన్నట్లు బీఎస్ఎఫ్ డీఐజీ ఎస్‌పీఎస్ సంధు తెలిపారు. అవుట్‌పోస్ట్‌కు కేవలం 300 మీటర్ల దూరంలోనే ఇది ఉన్నట్లు తెలిపారు. ఈ సొరంగం నుంచి భారత్‌లోని చివరి గ్రామానికి దూరం కేవలం 700 మీటర్లేనని చెప్పారు. అమర్‌నాథ్ యాత్రకు భంగం కలిగించేందుకు ముష్కరులు ఈ సొరంగం నుంచి భారత భూభాగంలోకి చొరబడేలా ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది.



# ఆకాశానికి చిల్లు... వీడని జల్లు...!!

## జనజీవనం అస్తవ్యస్తం... అష్ట కష్టాలు పడుతున్న చిరు వ్యాపారులు

## తెలుగు రాష్ట్రాల్లో ఎడతెరిపి లేని వర్షాలు

హైదరాబాద్ / అమరావతి : ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు వర్షాలు ముంచెత్తుతున్నాయి. పలు జిల్లాల్లో గంట వ్యవధిలోనే 5 నుంచి 10 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వాగులకు వరదలు వచ్చి నదులుగా మారుతున్నాయి. అతి భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో బీభత్సమే మిగిలింది. పలు ప్రాంతాలకు ముంపు ముప్పు పొంచింది. అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో మూడు రోజులు భారీ వర్షాలు తప్పవని వాతావరణ శాఖ అప్రమత్తం చేసింది. అతి భారీ వర్షాలు :తెలంగాణకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. హైదరాబాద్ లో అతి భారీ వర్షం పైన అధికారులు అప్రమత్తం చేసారు. ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, యాదాద్రి-భువనగిరి జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ నాగరత్న తెలిపారు. జూన్ 1 నుంచి బుధవారం నాటికి 313.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 416.2 మిల్లీమీటర్ల



వర్షపాతం నమోదైనట్టు చెప్పారు. సాధారణం కంటే దాదాపు 33 మిల్లీమీటర్ల అధిక వర్షపాతం నమోదైందని, మరో వారంపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలతో మరింత అధిక వర్షపాతం రికార్డు అయ్యే అవకాశం ఉన్నదని వెల్లడించారు.

**మూడు రోజుల పాటు:** మరో మూడు రోజులు వర్షాలు కొనసాగే అవకాశాలున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.

పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనానికి రుతుపవన ద్రోణి బుధవారం తోడైంది. దీని ప్రభావంతో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశాలున్నాయి. మత్స్యకారులెవ్వరూ చేపలవేటకు వెళ్లదని హెచ్చరించింది. 27న పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో అధికారులను రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. మరో రెండు రోజులు వర్ష తీవ్రత ఎక్కువగా ఉన్నందున పాత భవంతులను వీడి ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని హెచ్చరించింది. గుండెపోటుతో పటాన్‌చెరు ఎమ్మెల్యే కుమారుడి మృతి పాఠశాలలకు సెలవులు:ఏపీలోని నాలుగు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, అల్లూరి జిల్లాలకు రెడ్ అలెర్ట్ గా ప్రకటించారు. రానున్న 48 గంటల పాటు భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక జారీ చేశారు. ఏపీలోని మిగిలిన జిల్లాలో రానున్న రెండు రోజులు మోస్తారు నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.



క్రిష్ణా, గోదావరి జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో అక్కడి జిల్లా యంత్రాంగం పాఠశాలలకు సెలవు ప్రకటించింది. గోదావరి వరద భద్రాచలంను వణికిస్తోంది. గంట గంటకు వరద తీవ్రత పెరుగుతోంది రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. జలాశయాల వద్ద అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు.



## నేడు తెలంగాణ కేబినెట్ భేటీ!

హైదరాబాద్: ప్రభుత్వ పథకాలు, ఇతర పాలనా అంశాలకు సంబంధించి శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జరుగుతున్న ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు వెలువడే అవకాశముంది.

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రాష్ట్ర శాసనసభ ఎన్నికలు, రాజకీయాలు, ప్రభుత్వ పథకాలు, పరిపాలన తదితర అంశాలపై సీఎం కేసీఆర్ సమావేశం నిర్వహించారు.

ప్రగతిభ వన్‌లో ఐదు గంటల పాటు జరిగిన ఈ సుదీర్ఘ భేటీలో మంత్రులు కే టీ రామారావు, హరీశ్‌రావు పాల్గొన్నారు. రాష్ట్రంలో వర్ష ప్రభావంతో పాటు హైదరాబాద్, వరంగల్ పట్టణాల్లో వరదలపై చర్చించారు. గతంలో వరదల సందర్భంగా వరంగల్‌కు ఇచ్చిన హామీలు, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించాలని కేటీఆర్‌ను సీఎం ఆదేశించినట్లు సమాచారం.

**రాజకీయ పరిస్థితులపై చర్చ...** రాష్ట్రంలో రాజకీయ వాతావరణం, జిల్లాల వారీగా పార్టీ పరిస్థితి వంటి అంశాలపైనా స్థూలంగా చర్చ జరిగినట్లు తెలిసింది. ఇప్పటికే వీఆర్‌ఏల క్రమబద్ధీకరణ, దివ్యాంగులకు పెన్షన్ పెంపు, మైనారిటీలకు ఆర్థిక సాయం, బీసీ బంధు వంటి కీలక ప్రకటనలు చేసిన కేసీఆర్.. శుక్రవారం జరిగే కేబినెట్ భేటీ అనంతరం మరిన్ని ప్రకటనలు చేసే సూచనలు కనిపిస్తున్నాయి.

రెండో వేతన సవరణ కమిషన్ ఏర్పాటు, మధ్యంతర భృతి, అసెంబ్లీ వర్షాకాల సమావేశాల షెడ్యూల్, గవర్నర్ కోటా శాసనమండలి సభ్యుల ఎంపిక తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ఇక ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపైనా కేటీఆర్, హరీశ్‌కు కేసీఆర్ పలు సూచనలు చేసినట్లు సమాచారం.

## మూసి వరదను ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తున్నాం..

## చిల్లర విమర్శలొద్దు..



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు... క్షేత్రస్థాయిలో ఉన్న కిందిస్థాయి సిబ్బంది వరకూ వర్షాలకు సంబంధించిన పనుల్లో అందరూ నిమఘ్నమయ్యారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పురపాలక ఉద్యోగుల అన్ని సెలవులను రద్దు చేయడం జరిగిందన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఫోన్ల ద్వారా ఇతర మాధ్యమాల ద్వారా సమీక్షిస్తున్నామన్నారు. కుంభవృష్టిగా వర్షం పడడం.. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడం వలన ప్రజలకు కొంత ఇబ్బంది ఎదురవుతోందన్నారు. కానీ ఇప్పటి వరకూ ఎలాంటి ప్రాణా నష్టం జరగకుండా సాధ్యమైనంత ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. తమ ప్రధాన లక్ష్యం ప్రాణ నష్టం జరగకుండా చూడడమేనని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ కు రెడ్ అలర్ట్ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తోందన్నారు. హైదరాబాద్ నగరంలో డిసిల్టింగ్ కార్యక్రమాన్ని ఎప్పుడో పూర్తి చేశామన్నారు. దీంతో పాటు చెరువుల బలోపేతం చేసే కార్యక్రమాలు కూడా చేపట్టామన్నారు. 135 చెరువులకు గేట్లు బిగించామని.. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు అధికారులు సిబ్బంది కూడా విస్తృతంగా పనిచేస్తున్నారన్నారు. గతంలో ఇలాంటి భారీ వర్షాలు పడితే అనేక ప్రాంతాలు జలమయం అయ్యేది. అయితే ఈసారి నాలా డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా చేపట్టిన కార్యక్రమాల వలన వరద ప్రభావం కొంత తగ్గిందని కేటీఆర్ అన్నారు. "గత సంవత్సరంతో పోల్చుకుంటే ఆయా ప్రాంతాల్లో వరద సమస్య బాగా తగ్గింది. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సిబ్బంది 24 గంటలు ఈ భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు పనిచేస్తోంది. ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు మాని... భారీ వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలి. భారీ వర్షాల్లో నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతీసే విధంగా చిల్లర విమర్శలు చేయవద్దు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు వర్షాన్ని ఎదుర్కొనేందుకు పనిచేస్తున్నాయి వారి మనో ధైర్యం దెబ్బతినకుండా నాయకులు మాట్లాడితే బాగుంటుంది.

వరద పెరిగే ప్రాంతాల్లో ఉన్న పౌరులను అలర్ట్ చేస్తున్నాం. ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేస్తూ తాత్కాలిక షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నాం. చెరువులకు గండి పడే ప్రమాదం ఉంటే వాటిని కూడా సమీక్షిస్తున్నాం. మూసి వరదను ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తున్నాం. వర్షాలు తగ్గుముఖం పట్టగానే వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటాం. వరంగల్ నగరానికి వెళ్లాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించాం. అవసరమైతే రేపు నేను కూడా స్వయంగా వెళ్తాను" అని కేటీఆర్ పేర్కొన్నారు.




## సురక్షితంగా బయటపడ్డ 'మోరంచపల్లి'

జయశంకర్ భూపాలపల్లి: వరదల్లో చిక్కుకున్న మోరంచపల్లి గ్రామస్తులు సురక్షితంగా బయటపడ్డారు. భారీ వర్షాల కారణంగా మోరంచవాగు పొంగిపొర్లడంతో గ్రామంలోకి వరద నీరు వచ్చి చేరింది. గ్రామంలోని ఇళ్లు నీటమునిగాయి. దీంతో అక్కడి ప్రజలు భవనాలపైకి ఎక్కి తమను రక్షించాలంటూ ఆర్తనాదాలు చేశారు. మోరంచపల్లి గ్రామస్తుల పరిస్థితిపై సీఎం కేసీఆర్ స్వయంగా స్పందించారు. హెలికాప్టర్ల ద్వారా వారిని రక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. వెంటనే అధికార యంత్రాంగం అక్కడకు తరలివెళ్లి రెస్క్యూ ఆపరేషన్ మొదలుపెట్టింది. హెలికాప్టర్లు, బోట్ల ద్వారా గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గ్రామంలోని ప్రజలందరినీ సేఫ్‌జోన్‌కు చేర్చారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకుండా మోరంచపల్లి గ్రామస్తులు అంతా సురక్షితంగా బయటపడటంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. దీనిపై అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి మాట్లాడుతూ... పాత వరంగల్ , భూపాలపల్లి జిల్లా మోరంచపల్లిలో పరిస్థితి మరీ దారుణంగా ఉందని తెలిపారు. మోరంచపల్లిలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. అక్కడి ప్రజలను సురక్షితంగా కాపాడగలిగామన్నారు. మోరంచపల్లి గ్రామంలో మొత్తం ప్రజలను సేఫ్ జోన్‌కు తరలించామన్నారు. కాటారం మండలంలో నలుగురు నీళ్లలో ఉన్నారని.. వారికోసం బోట్‌లను పంపించామన్నారు. అగ్నిమాపక శాఖ బృందాలు రాష్ట్ర వ్యాప్తంగా అలెర్ట్‌గా ఉన్నారన్నారు. ఇండ్లు, చెట్లు కూలిపోయినా తమ సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. మోరంచపల్లిలో 70 మందిని రెస్క్యూ ఆపరేషన్ చేసి కాపాడగలిగినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. సెల్ఫీల కోసం ఆరాటపడొద్దన్నారు. ములుగులో ఇలా సెల్ఫీ కోసం వెళ్ళిన వారిని కాపాడేందుకు తమ సిబ్బంది చాలా శ్రమించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 బోట్‌ల ద్వారా సహాయక చర్యలు చేపడుతున్నట్లు అగ్నిమాపక శాఖ డీజీ వెల్లడించారు. వరంగల్ టౌన్‌లో కూడా బోట్స్ సహాయంతో లోతట్టు ప్రాంతాల్లో సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. మంథనిలో కూడా ఇసుక క్వారీ వద్ద తొమ్మిది మందిని కాపాడామని.. ఇద్దరిని ఇంకా కాపాడే ప్రయత్నం సాగుతోందన్నారు. హెలికాప్టర్ ద్వారా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఎక్కడ ఇబ్బంది ఉన్నా 100, 101కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ కూడా బయటకి రావద్దని.. శుక్రవారం కూడా వర్ష ప్రభావం ఉంటుందని.. అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి సూచించారు.

# సంపాదకీయం

## ఏపీ వర్సెస్ తెలంగాణ.. విభజన అంశాలపై ఎవరి వాదన ఏంటి.. తాజా వివాదం ఏంటి?

ఏపీ విభజన చట్టంలోని షెడ్యూల్ 9 10 సంస్థలను.. తక్షణమే విభజించాలని సుప్రీంలో ఏపీ ప్రభుత్వం పిటిషన్ వేసింది. దీనిలో కేంద్రం తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రతివాదులుగా చేర్చింది. ఈ పిటిషన్పై విచారించిన సుప్రీంకోర్టు కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. ఏపీ విభజన చట్టంలోని షెడ్యూల్ 9 10 సంస్థల విభజనలో తీవ్ర ఆలస్యం అవుతుండడం తెలిసిందే. అయితే.. దీనికి పరిష్కారం కూడా.. విభజన చట్టంలోనే ఉంది. జనాభా నిష్పత్తి(ఏపీ 58:42 తెలంగాణ) ప్రాతి పదికన.. ఈ సంస్థలను విభజించుకోవాలని.. ఇదే చట్టం పేర్కొంది. అయితే.. కేసీఆర్ దీనిని విభేదిస్తూ వచ్చారు. 'ఎక్కడి సంస్థలు అక్కడే' అన్న ప్రాతిపదికన ఉంచేయాలని పార్లమెంటులోనూ అప్పటి బీఆర్ఎస్ ఎంపీలు వాదించారు. ఇక ఏం జరిగిందో ఏమో.. ఈ విషయం మరుగున పడింది. వాస్తవానికి చంద్రబాబు హయంలోనే వీటిని పరిష్కరించేందుకు.. కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. అప్పట్లో కేంద్రం జోక్యం చేసుకునేందుకు సిద్ధంగా ఉందని.. కేంద్ర మంత్రిగా ఉన్న వెంకయ్య నాయుడు రాజ్యసభలో స్పష్టం చేశారు. అయితే.. ఆతర్వాత.. ఓటుకు నోటు కేసు వెలుగు చూసిన దరిమిలా.. ఏపీ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. 'ఇది మేం తేల్చుకుంటాం' అని పేర్కొంది. దీంతో ఈ విషయం అప్పటి నుంచి గోప్యంగానే ఉండిపోయింది. కానీ తరచుగా.. విద్యుత్ ఉద్యోగుల సమస్యవిద్యుత్ బకాయిల సమస్య నాగార్జున సాగర్ జలాలు వంటివి తెరమీదికి వచ్చినప్పుడు.. విభజన చట్టంలోని షెడ్యూల్ 9–10 తెరమీదికి వస్తున్నాయి. ఇక ఇప్పుడు అనూహ్యంగా ఈ విషయాలను సీఎం జగన్ ప్రభుత్వం సుప్రీం కోర్టు వరకు తీసుకువెళ్లింది. ఈ క్రమంలో సుప్రీం ఏం తీర్పు ఇస్తుందో చూడాలి. ఎలా చూసుకున్నా.. తెలంగాణ దిగిరాక తప్పదనే భావన న్యాయనిపుణుల్లోనే ఉంది.

**కేసీఆర్ కు బిగ్ షాకిచ్చిన ఏపీ ప్రభుత్వం :** ఏపీలోకి ఘనంగా ఎంట్రీ ఇద్దామని ప్లాన్ చేస్తున్న బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ కు గట్టి షాక్ ఇచ్చింది ఏపీ ప్రభుత్వం. విభజన అంశాలపై.. ముఖ్యంగా ఏపీకి రావాల్సిన సంస్థల విషయంపై కోర్టుకెక్కింది. 8 ఏళ్ళ గా ఈ విషయంలో స్పందించకుండా జాప్యంచేస్తున్న కేసీఆర్ సర్కార్ పై ఇప్పుడు ఫైట్ మొదలుపెట్టడం బీఆర్ఎస్ కు మింగుడుపడని వ్యవహారంగా మారింది. ఈ ఏడాది తెలంగాణలో ఎన్నికలు జరుగనున్నాయి. మరోవైపు ఏపీలో అడుగులు వేసేందుకు కేసీఆర్ సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే వైసీపీ ప్రభుత్వం విభజన అంశాల అస్త్రాన్ని తెరమీదకు తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సుప్రీంకోర్టు గడప తొక్కడం.. రాజకీయంగా కేసీఆర్ కు ఇబ్బందులు సృష్టించే అవకాశాలు ఉన్నాయి. ఎటువైపు అనుకూలంగా వ్యవహరించినా జాతీయ నేతగా.. కేసీఆర్ కు ఇబ్బందులు తప్పవు. విభజన చట్టంలో ఉమ్మడి ఏపీలోని ఆస్తులు జనాభా ప్రాతిపదికన పంచుకోవాల్సి ఉంటుంది. దీనికి తెలంగాణ సర్కార్ పట్టించుకోవడం లేదు. ఎక్కడి ఆస్తులు అక్కడే అని చెబుతోంది. ఇక ఇప్పుడు సుప్రీం గడప తొక్కిన నేపథ్యంలో కేసీఆర్ ఏం చేస్తారు.? అనేది ప్రశ్న. జాతీయ పార్టీ నాయకుడు కావడంతో కేవలం తెలంగాణ వాదాన్ని వినిపిస్తే ఇబ్బందులు తప్పవు. అలాగని చట్టం ప్రకారం వెళితే ఏపీకి మెజార్టీ ఆస్తులు దక్కుతాయి. తెలంగాణ సెంటిమెంట్ కు బొక్కపడుతుంది. ఇక ఏపీకి ఇవ్వాల్సిన ఆస్తులు ఇవ్వమని అంటే రేపు ఏపీలో ఎలా ఓట్లు అడుగుతామన్నది ప్రశ్న. ఏపీకి అన్యాయం చేశారనే వాదన కూడా తెరపైకి వస్తుంది. ఇలాంటి సమయంలో ఏపీలోని జగన్ ప్రభుత్వం విభజన హామీలపై సుప్రీంకోర్టుకు ఎక్కడం ప్రాధాన్యత సంతరించుకుంది. కేసీఆర్ కు ఈ కేసు రాజకీయంగా తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టాలా ఉందని అంటున్నారు.



## ఇసుకాసురులు

ఆసిఫాబాద్ : జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. అక్రమార్కులు నిబంధనలకు పాతరేసి అడ్డ గోలుగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఫలితంగా వాగులు, వంకలన్నీ వట్టిపోయి భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. జిల్లాలో ఎలాంటి ఇసుక రీచ్‌లు లేకపోయినా ట్రాక్టర్ల యజమానులు ఒక్కో పర్మిట్‌పై పదేసి ట్రిప్పుల చొప్పున ఇసుకను తరలిస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాల వ్యవహారంలో తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు రెవెన్యూ, పోలీసు అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ట్రాక్టర్ యజమానుల నుంచి ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు 2 వేల రూపాయల చొప్పున వసూలు చేస్తూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

– పెద్దవాగు మొదలుకుని..ఆసిఫాబాద్ పట్టణ శివారులోని పెద్దవాగు మొదలుకుని దహెగాం మండలంలోని ఎర్రవాగు వరకు నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్న ఇసుక చోరులు మాఫీయాను తలదన్నే రీతిలో ఏకంగా ఎక్స్‌కావేటర్, డోజర్లు వంటి వాటిని వినియోగించి ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. వాస్తవానికి కుమరం భీం జిల్లాలో అధికారికంగా ఎలాంటి ఇసుక రీచ్‌లు గుర్తించలేదు. అయినప్పటికీ అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల అండతో స్మగ్లర్లు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం టన్ను ఇసుకకు 2,000 నుంచి 2,500 రూపాయల వరకు ధర పలుకుతోంది. నిబంధనల ప్రకారం లారీలలో ఇసుక తరలించరాదన్న ఆదేశాలు ఉన్నాయి. దీంతో అక్రమార్కులు వ్యూహాత్మకంగా రూట్ మార్చి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రహస్య ప్రాంతాల్లో డంప్ చేస్తూ అక్కడి నుంచి లారీల్లో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు చెబుతున్నారు. రెబ్బెన మండలంలోని గంగాపూర్, పులికుంట, కొండపల్లి వాగులతో పాటు దహెగాం మండలంలోని కల్వాడ ఎర్రవాగు, పెద్దవాగు, కౌటాల మండలంలోని ముత్తంపేట, తాట్‌పల్లి వాగులు, చింతలమానెపల్లి మండలంలోని రుద్రాపూర్, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్ మండలంలోని రాస్పెల్లి, పెద్దవాగు, కెరమెరి మండలంలోని సాంగ్వీ, కైరి వా గు, సిర్పూర్(టి) మండలంలోని పెద్దబండ వాగుల నుంచి అక్రమార్కులు పెద్ద ఎత్తున ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారమంతా సంబంధిత రెవెన్యూ అధికారులు, పోలీసులకు తెలిసినా ఇసుక సిండికేట్లు వారికి నెల వారీగా ముడుపులు అప్పగిస్తుండడంతో పట్టించుకో వడం లేదని ప్రజలు వాపోతున్నారు. – పడిపోతున్న భూగర్భ జలమట్టం..వాగుల్లో ఇసుక తవ్వకాల మూలంగా భూగర్భ జలమట్టం దారుణం గా పడిపోతున్నట్లు భూగర్భ జల వనరుల శాఖ సేకరించిన సర్వేల్లో వెల్లడైంది. ముఖ్యంగా వాగులు, ఒర్రెలు ఉన్న పరిసరాల్లో ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దాంతో ఆయా ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలు, గూడాల్లో వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తుతోంది. నిబంధనల ప్రకారం నదులు, ఉప నదుల్లోనే మీటర్ లోతుకు మించి ఇసుక తవ్వకాలు జరపడం నిషేధం. వాల్టా చట్టాన్ని అనుసరించి వాగులు, వంకల్లో అసలు ఇసుకే తీయరాదు. కాగా జిల్లాలో అక్రమార్కులు నిబంధనలు తుంగలో తొక్కుతూ అక్రమంగా ఇసుక దోపిడీకి పాల్పడుతుండడం గమనార్హం. ఉన్నతాధికారులు ఇసుక అక్రమ దందాను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లావా సులు కోరుతున్నారు.

నిఘా ముమ్మరం..– నాగరాజు, ఏడీ మైనింగ్‌శాఖ

అక్రమ ఇసుక రవాణాను అడ్డుకట్ట వేసేందుకు నిఘా ముమ్మరం చేశాం. ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడుతున్నాం. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు పట్టుకుని యాజమానులకు జరిమానా వేస్తున్నాం. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

## ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల్లో చేరేదెప్పుడో?

ఆదిలాబాద్ : సమస్యలు పరిష్కరించాలంటూ సమ్మెబాట పట్టిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై వేటు వేసిన ప్రభుత్వం రెండేళ్ల తర్వాత తిరిగి విధుల్లోకి తీసుకుంటామని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆరే ప్రకటించారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్లలో ఆనందం వెల్లువిరిసింది. జిల్లా వ్యాప్తంగా కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. అయితే సీఎం ప్రకటన చేసి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ అధికారికం గా ఆదేశాలు జారీ కాలేదని సంబంధిత అధికారులు చెప్పడంతో మళ్లీ నిరాశనే కనిపిస్తోంది. అసలు ప్రకటించిన విధంగా విధుల్లోకి తీసుకుంటారా.. ఇంకేమైనా షరతులు విధిస్తారా అనే దానిపై స్పష్టత కనిపించడం లేదు. జిల్లాలో 132 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు విధులకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులు ఊ పందుకుంటున్నాయి. ఈ క్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లను విధులకు తీసుకుంటేనే కూలీలకు కొంత మేలు జరిగే అ వకాశం కనిపిస్తోంది. ఇప్పటికే ఎఫ్ఏలను విధులకు దూరం చేయడంతో కొంత మంది ప్రత్యామ్నయంగా ఉపాధిని పొందుతున్నారు. ఒక వేళ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే ఎంత మంది విధుల్లో చేరుతారో స్పష్టత రానుంది. విధులకు దూరమై రెండేళ్లు!ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని 2020 మార్చి నెలలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగారు. ప్రభుత్వం హెచ్చరించినా వెనక్కి తగ్గక పోవడంతో ఆగ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించింది. అప్పటి నుంచి అందుబాటులో ఉన్న మేట్‌లతో ఉపాధి పనులను నెట్టుకొస్తున్నారు. నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతను పూర్తిగా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. పలుమార్లు ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని పలు రాజకీయ పార్టీలతో పాటు స్వయంగా కలిసి వినతులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే ఎవరూ ఊహించని విధంగా సీఎం కేసీఆర్ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లను మళ్లీ విధుల్లోకి తీసుకుంటామని ప్రకటించడంతో మళ్లీ ఆశలు రేకెత్తించాయి. స్వయాన సీఎం ప్రకటించి రెండు మాసాలు గడుస్తున్నా ఆచరణలో మాత్రం అడుగు ముందుకు పడినట్లు కనిపించడం లేదు. అధికారిక ఆదేశాలు రాక పోవడంతో మళ్లీ ఫీల్డ్ అసిస్టెంట్ల విధుల పై అనుమానాలే వ్యక్తమవుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులపై పని భారంరాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి ఆ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. దీంతో పంచాయతీ కార్యదర్శులపై మరింత పని భారం పెరగడంతో ఉపాధి పనుల పర్యవేక్షణ కరువవుతోంది. గ్రామాల్లో పల్లె ప్రగతి పనులు కూడా కొనసాగడం వాటికి సంబంధించిన ప్రగతి నివేదికలు ఇతర పనులతో కార్యదర్శులు ఉపాధి పనుల వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు లేక పోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద చేపట్టే సీసీ రోడ్లు, కల్లాలు, నర్సరీల నిర్వాహణపై దృష్టి సారించ లేక పోతున్నారు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ కరువవడంతో అక్రమాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతికి గ్రామ కార్యదర్శులను బాధ్యులుగా చేయడంతో కొన్ని సందర్భాల్లో సస్పెన్షన్‌కు గురవుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఇటు పంచాయతీ విధులు, అటు ఉపాధి పనుల పర్యవేక్షణ కష్టంగానే మారుతుందని పలువురు కార్యదర్శులు జిల్లా అధికారులకు మొర పెట్టుకున్న సందర్భాలు కూడా లేక పోలేదు. ఇలాంటి పరిస్థితులతో కూలీల ఇబ్బందులను పట్టించుకున్న దాఖలాలే కనిపించడం లేదు. మెట్లు కేవలం హాజరుశాతాన్ని నమోదు చేసేందుకే పరిమితమవుతున్నారు. కూలీల సంఖ్యను పెంచేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఎలాంటి ఆదేశాలు అందలేదు..– కిషన్ (డీఆర్డీఏ పీడీ, ఆదిలాబాద్)తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటన చేసిన ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ఆదేశాలు అందలేదు. దానికి సంబంధించిన విధి విధానాలు ఖరారు కాలేదు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకుంటాం. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపాధి హామీ పనులను నిర్వహిస్తున్నాం. మేట్లకు ప్రత్యేక శిక్షణను ఇచ్చి పని దినాలు, హాజరు, ఇతర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచిస్తున్నాం. వెంటనే విధుల్లోకి తీసుకోవాలి..– సుధాకర్‌రెడ్డి (ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు)తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి. గత రెండేళ్లుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించినా అధికారులు విధులను అప్పగించడం లేదు. ఎన్నో ఏళ్లుగా ఉపాధి కూలీలకు సేవలను అందిస్తూ వస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం బా?ధాకరం. అన్ని వర్గాలకు అందిస్తున్న సంక్షేమ పథకాల మాదిరిగానే ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రస్తుతం ఉపాధి పనులు ఊపందుకోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకుంటే కూలీలకు ప్రయోజనం ఉంటుంది.

## పరీక్షలకు పకడ్బందీగా ఏరాట్లు చేయాలి

సిరిసిల్ల : జిల్లాలో పదోతరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కలెక్టర్, జిల్లా ఎస్పీలను కోరారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ రాహుల్ హెగ్డే, విద్యాశాఖ అధికారులతో మంత్రి పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించారు. మే 6వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ పరీక్షలు, మే 23వ తేదీ నుంచి జూన్ 1 వరకు పదోతరగతి పరీక్షలను నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బందులు కలగకూడదని సూచించారు. పరీక్షలు రాసే విద్యార్థులు మనోధైర్యం కోల్పోకుండా మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రత్యేక నిపుణుల ద్వారా కౌన్సెలింగ్‌లను అందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ అధ్వర్యంలో 18005999333 అనే ట్రోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లు, ఉపాధ్యాయులు సిబ్బంది ఈ ట్రోల్ ఫ్రీ నెంబర్‌ను విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ రాహుల్‌హెగ్డే మాట్లాడుతూ జిల్లాలో పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 35 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అందులో 6379 మంది రెగ్యూలర్ విద్యారు?లు ఐదుగురు ప్రైవేటుగా విద్యార్థులు పదవ తరగతికి హాజరవుతన్నారని వివరించారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న 4474, రెండో సంవత్సరం చదువుతున్న 4462 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఈవో రాధాకిషన్, డీఐఈవో మోహన్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, బీసీ సంక్షేమ అధికారి మోహన్‌రెడ్డి, ఎస్సీ సంక్షేమ అ?ధికారి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైద్య, ఆరోగ్య శాఖలో అరకొర సిబ్బంది

జగిత్యాల : వైద్య, ఆరోగ్యశాఖలో రెగ్యులర్ డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది లేక పోవడంతో ప్రజలకు వైద్యసేవలు సకాలంలో అందడం లేదు. పూర్తిస్థాయిలో సిబ్బంది లేక పోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో పోస్టులను భర్తీ చేయక పోవడంతో జిల్లా ఆసుపత్రితోపాటు పట్టణ, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు సరిగా అందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆరోగ్య కేంద్రాల్లో సరైన వసతులు, పూర్తిస్థాయి అధికారులు, వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. కొత్తగా ఉద్యోగ నియామకాలు లేకపోవడంతో ఉన్నవారితోని సేవలు అందిస్తున్నారు. ఉన్న కొద్దిమందిలో కొందరు ఉద్యోగులు డిప్యూటేషన్లపై వేరే చోటుకు వెళ్లడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మొదలుకొని స్టాఫ్‌నర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ వారు కావలసిన చోటికి డిప్యూటేషన్‌పై వెళుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 6 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అందులో గంగాధర, చొప్పదండి, శంకరపట్నం, గుండి, వెల్ది, చల్లూరు, వీణవంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటల వైద్య సేవలు అందిస్తాయి. – డీఎంహెచ్‌వో కూడా డిప్యుటేషన్‌పై..జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ డాక్టర్ వెంకటరమణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఇక్కడకు రాకుండా హన్మకొండకు డిప్యుటేషన్‌పై వెళ్ళి అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ జువైరియాకు జిల్లా వైద్య అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. – పీహెచ్‌సీల్లో.. హుజురాబాద్ డిప్యూటి డీఎంహెచ్‌వో పోస్టుతోపాటు గుండి, మానకొండూర్, వెల్ది, చల్లూరు, చెల్పూర్, చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు కట్టరాంపూర్, సప్తగిరి కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా ప్రాథమిక, అర్బన్ హెల్త్‌సెంటర్లలో ఇతర సెంటర్లలోని మెడికల్ ఆఫీసర్లు డిప్యుటేషన్‌పై మెడికల్ ఆఫీసర్లుగా కొనసాగుతున్నారు. తిమ్మాపూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లలో ఒకరు చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. గుండిలో ఆసిఫ్‌నగర్ మెడికల్ ఆఫీసర్, మానకొండూర్‌లో కొత్తపల్లి మెడికల్ ఆఫీసర్, చెల్పూర్‌లో వీణవంక మెడికల్ ఆఫీసర్, చల్లూర్‌లోమెడికల్ ఆఫీసర్‌గా డిప్యుటేషన్‌పై విధలు నిర్వహిస్తున్నారు. సప్తగిరి కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో టీబీ డాక్టర్, కట్టరాంపూర్‌లో ఆర్‌బీఎస్‌కే, ఆయుష్ వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ట్రైనింగ్ స్కూల్ మెడికల్ ఆఫీసర్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. ఫ ల్యాబ్ టెక్నీషియన్లు..మెడికల్ ఆఫీసర్లే కాకుండా ల్యాబ్ టెక్నీషియన్లు కూడా డిప్యుటేషన్లపై కొనసాగుతున్నారు. మానకొండూరు, చామన్‌పల్లి, చొప్పదండి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్లు జిల్లా ఆసుపత్రిలో గల తెలంగాణ ప్రభుత్వ దయగ్నస్టిక్ సెంటర్(హబ్)కు డిప్యుటేషన్‌పై వచ్చారు.– స్టాఫ్‌నర్స్‌లు..వైద్యుల తర్వాత ముఖ్యపాత్ర పోషించేది స్టాఫ్‌నర్స్‌లే. వారిలో కొంతమంది డిప్యుటేషన్‌పై వెళుతున్నారు. ఆసిఫ్‌నగర్ పీహెచ్‌సీలో పని చేసే ఇద్దరిలో ఒకరు గుండి పీహెచ్‌సీకి, మరొకరు జిల్లా కేంద్రంలోగల పీపీయూనిట్‌కి డిప్యుటేషన్‌పై వెళ్ళారు. చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదుగురు స్టాఫ్‌నర్స్‌లకు గాను ముగ్గురు విధులు నిర్వహిస్తుండగా వారిలో ఒకరు కట్టరాంపూర్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లారు. శంకరపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు స్టాఫ్‌నర్స్‌లకు గాను ఒకరు జిల్లా ఆసుపత్రిలో, మరొకరు నర్సింగ్ స్కూల్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో ఉన్న కొద్దిపాటి సిబ్బందిపై అదనపు పనిభారం పడుతుంది. కొన్ని చోట్ల అవసరానికి మించి సిబ్బంది ఉన్నా వారిని సేవలను వినియోగించుకోవడం లేదు.

## పరిహారమేది..?

పెద్దపల్లి : కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా ముంపునకు గురవుతున్న భూములకు పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో బాధిత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గోదావరి నదిపై అన్నారం వద్ద సరస్వతి బ్యారేజీ, మంథని మండలం సిరిపురం వద్ద పార్వతి బ్యారేజీలను ప్రభుత్వం నిర్మించింది. ఈ బ్యారేజీలో నీళు నిల్వ చేసినప్పుడు వచ్చే బ్యాక్ వాటర్‌తో పలు గ్రామాలకు చెందిన భూములకు ముంపునకు గురవుతున్నాయి. ఆ భూముల్లో కొందరు రైతులు పంటలు వేసి నష్టపోతుండగా, మరికొందరు రైతులు పంటలు వేయకుండా నష్టపోతున్నారు. ముంపునకు గురవుతున్న భూములను సేకరించి నష్టపరిహారం చెల్లించాలని పలుసార్లు సంబంధిత రైతులు ప్రభుత్వానికి మొర పెట్టుకోగా సర్వేకు ఆదేశించింది. ఏడాదిన్నర క్రితం సర్వే నిర్వహించిన అధికారులు భూసేకరణ ప్రక్రియను ప్రారంభించారు. ముంపునకు గురవుతున్న భూములివే..సరస్వతి బ్యారేజీ కింద మంథని మండలం అమ్మగారిపల్లి గ్రామంలో 87 ఎకరాల భూములు ముంపునకు గురవుతున్నాయని గుర్తించారు. ఖాన్‌సాయిపేటలో 96 ఎకరాలు, ఆరెంద గ్రామంలో 177 ఎకరాలు, పార్వతీ బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో రామగిరి మండలం సుందిళ్లలో 48 ఎకరాలు, రామగుండం మండలం జనగామలో 142 ఎకరాలు, మల్కాపూర్‌లో 49 ఎకరాల భూములు ముంపునకు గురువుతున్నాయని గుర్తించారు. వీటికి గాను మార్కెట్ విలువలను అనుసరించి ఎకరానికి 6 నుంచి 12లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో అమ్మగారిపల్లి భూములకు 5 కోట్ల 78 లక్షలు, ఖాన్‌సాయిపేట భూములకు 6 కోట్ల 44 లక్షలు, సుందిళ్ల భూములకు 3 కోట్ల 24లక్షలు, జనగామ భూములకు 22కోట్లు, మల్కాపూర్ భూములకు 5 కోట్ల 87 లక్షలు, ఆరెంద భూములకు 12 కోట్ల రూపాయల పరిహారం చెల్లించాల్సి ఉంది. ఈ భూముల సేకరణకు నోటిఫికేషన్, డిక్లరేషన్ అయిపోయింది. ప్రభుత్వం మొత్తం 602 ఎకరాల భూములకు 55 కోట్ల 33 లక్షల రూపాయల నిధులను విడుదల చేస్తే అవార్డు పాస్ చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. పరిహారం సొమ్ము కోసం రెవెన్యూ శాఖాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించారు. ఏడాది గడుస్తున్నా కూడా ప్రభుత్వం డబ్బులను విడుదల చేయడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. రోజురోజుకు భూముల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ముంపునకు గురవుతున్న భూములకు ప్రభుత్వం ఇస్తామన్న పరిహారం ఏమాత్రం సరిపోదని, ఈ సొమ్ముతో ఇతర ప్రాంతాల్లో పది గుంటల భూమి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు. గత మూడేళ్లుగా కాళేశ్వరం బ్యాక్‌వాటర్‌తో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా రెండు పంటలు..ఈ ప్రాజెక్టు నిర్మించక ముందు ప్రతి ఏటా రెండు పంటలను సాగు చేసుకుని ఆ భూముల ఆధారంగానే జీవించామని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే తమ భూములకు కూడా సేకరించి పరిహారం ఇవ్వాలని మొత్తుకున్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదని అన్నారు. వారి అంచనాలు తప్పాయని బ్యాక్‌వాటర్ తమ భూములను ముంచెత్తుతుండడంతో నష్టపోవాల్సి వస్తున్నదని అన్నారు. పరిహారం సొమ్ము కోసం పలుసార్లు అధికారులకు విన్నవించడంతో పాటు నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం సుమారు లక్ష కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసిన ప్రభుత్వం కేవలం 56 కోట్ల రూపాయలను విడుదల చేయడంలో ప్రభుత్వం అలసత్వాన్ని ప్రదర్శించింది. సాటి రైతులకు సాగు నీటిని అందించేందుకు చేపట్టిన ప్రాజెక్టులో తమ భూములను కోల్పోయి త్యాగం చేసిన రైతులను ప్రభుత్వం విస్మరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. ప్రభుత్వం పెట్టే కోట్ల ఖర్చులో రైతులకు ఇవ్వాల్సిన పరిహారం సొమ్ము చాలా తక్కువ అని ఈప్రాంతవాసులు అంటున్నారు.

# చిగురించిన ఆశలు

హుస్నాబాద్: ఇటీవల కురిసిన వర్షాలతో వరి నాట్లు ఊపందుకున్నాయి. నార్లు పోసి నాటు వేద్దామా లేదా అని ఇన్నాళ్లు ఎదురు చూసిన రైతులంతా వరిసాగు పనుల్లో నిమగ్నమయ్యారు. హుస్నాబాద్ డివిజన్ మొత్తం మెట్ట ప్రాంతం. సాగునీటి సౌకర్యం లేదు. వర్షాలు బాగా పడతాయనే ఆశతో రైతులు వరిసాగు చేసేందుకు జూన్‌లో నార్లు పోశారు. బావులు, బోర్లలో నీరు పుష్కలంగా ఉన్న రైతులు మాత్రమే నాట్లు వేశారు. రైతులు తమ కుటుంబ సభ్యులతో సహ పొలం పనుల్లో నిమగ్నయ్యారు. పొలం చదును, నాట్లు వేయడం, గుంటుక కొట్టి దుక్కులు దున్నడం, విత్తనాలు చల్లుకోవడం, తదితర పనుల్లో తీరిక లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాల వద్ద గడుపుతున్నారు. ఆగస్టు 15 లోపు నాట్లు వేయడం పూర్తి చేసుకుంటే చీడపీడల బాధ నుంచి రక్షించుకోవడంతో పాటు దిగుబడి సైతం పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

నారు సిద్ధం హుస్నాబాద్‌లో 800 ఎకరాలు, అక్కన్నపేట మండలంలో 2500 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. ఆలస్యంగానైనా వర్షాలు పడటంతో రైతులకు కొంత ఊరట లభించింది. హుస్నాబాద్‌లో మరో 7 వేల ఎకరాలు, అక్కన్నపేటలో 15 వేల ఎకరాల్ల వరినాట్లు వేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.



ఈ వానకాలం సీజన్‌లో చిన్నకోదూరు ప్రాంతంలో మొత్తం 25,000 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు మొదటగా అంచనా వేశారు. ఇందులో వరి 15,000, మొక్కజొన్న 3,000, పత్తి 3,000, పొద్దుతిరుగుడు, వేరుశనగ, ఆయిల్‌పామ్, కూరగాయలు, తదితర పంటలు మరో 4,000 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు నిర్ధారించారు. ఇప్పటి వరకు వరి 2,500 ఎకరాల్లో వేయగా మరో 12,500 ఎకరాలకు సరిపడా నారుమళ్లను సిద్ధం చేశారు. మొక్కజొన్న 850, పత్తి 1,000 ఎకరాల్లో వేశారు. మొదటగా అంచనా వేసిన సాగు లక్ష్యాన్ని చేరుకుంటామని, విత్తనాలు కొనుగోలు చేసే సమయం లో రైతులు తప్పనిసరిగాతీసుకోవాలని ఏవో జయంత్ సూచించారు.

# ఆదరణ ఉన్నా అలసత్వం!

చేర్యాల: ప్రముఖ ఆలయాల వద్ద దైవదర్శనానికి భక్తులు ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. అక్కడి తీర్థప్రసాదాలను ఉచితంగానో, డబ్బులు పెట్టి కొనుక్కొని ఇంటికి తీసుకెళ్లడానికో ముఖ్యమనుకుంటారు. చక్కెరతో చేసే ప్రసాదాలైతే మధుమేహులు తక్కువ ఇష్టం చూపుతారని భావించి కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో నాలుగేళ్ల క్రితం చక్కటి నిర్ణయం తీసుకున్నారు. బెల్లంతో లడ్డూ ప్రసాదం తయారు చేసి భక్తులకు అందించాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనరు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్ణయించారు. 2019 మే నెల నుంచి చక్కెరతో పాటు బెల్లంతో చేసిన లడ్డూలను అందుబాటులో ఉంచడం ప్రారంభించారు. పది నెలల పాటు అమలు చేశారు. ప్రతి ఆదివారం నాలుగు వేల లడ్డూలు అమ్ముడయ్యాయి. తర్వాత కారణమేదీ చూపకుండా తయారీ నిలిపేశారు. బెల్లం లడ్డూల తయారీకి పాకం పట్టడం, వేడిగా ఉండగా లడ్డూ వత్తడానికి కూలీల కొరత కారణంగా నిలిపేశారు. భక్తుల ఆదరణ తగ్గిందని సాకులు చెబుతున్నారు.

సిరా సంగతి అంతేఆలయాల వద్ద లడ్డూ, పులిహోరతో పాటు 'సిరా' ప్రసాదం కూడా తయారు చేయాలని దేవదాయ కమిషనరు నిర్ణయించారు. ఈ మేరకు 2022 జూన్ నుంచి మల్లన్న సన్నిధిలో ప్రారంభించారు. రంగు, రుచి భక్తులను ఎంతోగానో ఆకర్షించింది. ప్రారంభించిన పక్షం రోజుల్లో డిమాండ్ పెరిగింది. మొదట్లో కేవలం 2 కిలోలతో చేసేవారు. తర్వాత ఆరు కిలోల సిరా అందుబాటులో ఉంచారు. మధ్యాహ్నం లోపు పూర్తిగా అమ్ముడయ్యేది. తర్వాత ఎవరడిగినా ఆలయ వర్గాలు అందించలేకపో యాయి. అంతగా ఆకర్షించిన ఈ రెండు రకాల (బెల్లం లడ్డూలు, సిరా) ప్రసాదాలను అర్ధాంతరంగా ఆపేశారు. సిరా ప్రసాదాన్ని మాత్రమే అందుబాటులో ఉంచుతున్నామని.. బెల్లం లడ్డూలను భక్తులు ఆదరించకపోవడంతో తయారు చేయడం లేదని ఈవో బాలాజీ తెలిపారు.

# ఉపాధి కోర్సు..ఇంకా ఖాళీలే!

మెదక్ : పారిశ్రామిక శిక్షణ నైపుణ్యం కలిగిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు తలుపు తడుతున్నాయి. తక్కువ సమయంలో కొలువులు సాధించి స్థిరపడాలనుకునే యువతకు పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) చక్కటి అవకాశం కల్పిస్తోంది. ఐటీఐల్లో డ్యూయల్ సిస్టమ్ ఆన్ జాబ్ ట్రైనింగ్ (ఓజేటీ)ను అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యార్థి తరగతులకు హాజరవుతూనే పరిశ్రమల్లో ప్రయోగాత్మక శిక్షణకు వెళ్లి సంపాదించుకోవచ్చు. విద్యార్థుల సమయం వృథా కాకపోవడంతో పాటు పారిశ్రామిక నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయి. పనిచేసే క్రమంలో వచ్చే సందేహాలను అధ్యాపకులు నివృత్తి చేస్తారు. ఇన్ని అవకాశాలు ఉన్నప్పటికీ విద్యార్థులు ఐటీఐ కోర్సులపై అంతగా ఆసక్తి చూపకపోవడం గమనార్హం.

114 సీట్లకు 35 భర్తీ

జిల్లా పరిధిలో మెదక్‌లోనే ఏకైక ప్రభుత్వ ఐటీఐ ఉండగా, ప్రైవేటులో 9 ఐటీసీలు ఉన్నాయి. ఐటీఐలో ప్రథమ సంవత్సరానికి 114 సీట్లు కేటాయించారు. ఈనెల 3–10వ తేదీ వరకు తొలి విడత ప్రవేశాల్లో 35 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ప్రైవేటు సంస్థల్లో సగం కూడా నిండలేదు. రెండో విడత ప్రవేశాలకు ఈనెల 31 వరకు గడువుంది. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు వెబ్‌సైట్‌లో ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పదిలో పొందిన గ్రేడ్, మార్కుల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. బాలికలకు అన్ని కోర్సుల్లో 33 శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది.ఇవీ కారణాలు..గతంలో ఐటీఐ పరీక్షలు రాత పద్ధతిలో జరిగేవి. రెండేళ్లుగా ఆ పద్ధతి మారింది. ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. ఐటీఐ కోర్సుల్లో చేరుతున్న వారిలో అత్యధికులు ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చిన వారే కావడంతో కంప్యూటర్ పరిజ్ఞానం తక్కువగా ఉండటం, పరీక్షలు ఆంగ్లంలోనే రాయాల్సి వస్తుండటంతో ఉత్తీర్ణత శాతం తగ్గుతోంది. మరోవైపు ఐటీఐ చదివితే పరిశ్రమల్లో పని చేయాల్సి ఉంటుంది. అదే ఇంటర్ చదివి సాఫ్ట్‌వేర్ కోర్సులు పూర్తి చేస్తే ఎక్కువ వేతనాలు అందుతాయన్న ఉద్దేశంతో అటువైపు మొగ్గు చూపుతున్నారు. పరిశ్రమల్లో అధునాతన సాంకేతిక అందుబాటులోకి వచ్చినా శిక్షణకు ఇంకా పాత యంత్రాలు వినియోగిస్తుండటంతో నైపుణ్యాలు పెంచుకోలేని పరిస్థితి.సత్వర ఉపాధి పొందవచ్చు: పి.చంద్రశేఖర్‌రావు, ఐటీఐ ప్రిన్సిపల్, మెదక్సత్వర ఉపాధికి ఐటీఐ ఎంతో దోహదపడుతుంది. కేంద్రం అప్రెంటిస్ మేళాల నిర్వహణకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఏటా వేల సంఖ్యలో ఉద్యోగాలు కల్పించడానికి ఇవ దోహదం చేస్తాయి. ఆసక్తి ఉన్న వారు రెండో విడతలో దరఖాస్తు చేసుకోండి.

# ఆసుపత్రి నిర్వహణ అధ్వానం



గోదావరిఖని : గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆసుపత్రికి స్థాయితో పాటు సదుపాయాలు, వైద్యులు పెరిగినప్పటికీ పర్యవేక్షణ లేమితో నిర్వహణలో ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా పాలనాధికారిని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా నియమిస్తూ 2022 జూన్ 6న ప్రభుత్వం జీఓ విడుదల చేసినప్పటికీ ఇంతవరకూ పూర్తిస్థాయి కమిటీ నియామకం జరగలేదు. దీంతో ఆసుపత్రి అభివృద్ధి, నిర్వహణకు సంబంధించిన అనేక సమస్యలు యథావిధిగా ఉన్నాయి. కమిటీ ఏర్పాటు కోసం పలుమార్లు ఆసుపత్రి వర్గాలు జిల్లా కలెక్టర్‌కు నివేదించినప్పటికీ వివిధ కారణాలతో నియామకం జరగలేదు. నూతనంగా జిల్లా పాలనాధికారిగా బాధ్యతలు చేపట్టిన ముజామిల్‌ఖాన్ ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించి ఆసుపత్రి నిర్వహణను గాడిలో పెడతారనే ఆశలు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వ్యక్తమవుతున్నాయి.ప్రధాన సమస్యలివీ... వార్డుల్లో తాగునీటి కొరత తీవ్రంగా ఉంది. బాలింతలు, రోగుల బంధువులు బయటి నుంచి నీటని కొని తెచ్చుకోవాల్సి వస్తుంది. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే నిరుపేదలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు చేయాల్సి ఉంది. వార్డుల్లో ఏర్పాటు చేసిన ఫ్యాన్లు రోగులు/బాలింతలకు సరిపడకపోవడంతో ఇంటి నుంచి టేబుల్‌ఫ్యాన్లను తెచ్చి పెట్టుకుంటున్నారు. వార్డుల్లో ఏసీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. 85 పడకల సామర్థ్యంతో అదనపు భవన నిర్మాణం చేపట్టినప్పటికీ అందులోని పడకలకు ఆక్సిజన్ సదుపాయం లేదు. ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంటునుంచి నూతన భవనంలోకి ఆక్సిజన్ సరఫరా ఏర్పాట్లకు రూ.18 లక్షలతో అంచనాలు సిద్ధం చేశారు. ఆసుపత్రి పాత భవనంతో పాటు దానిపై నిర్మించిన మరో అంతస్తులో కొన్ని సమస్యల పరిష్కారానికి సుమారు రూ.1.5 కోట్లు నిధులు అవసరం కానున్నాయి. రూ.7 కోట్లతో ఆసుపత్రిపై మరోఅంతస్తు నిర్మాణం చేపట్టిన ఎన్టీపీసీ యాజమాన్యం సమన్వయంతో నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.వైద్యులు, సహాయ ఆచార్యుల సంఖ్య పెరిగినప్పటికీ గదుల కొరతతో అందరూ ఒకే గదిలో వైద్య సేవలందించాల్సి వస్తుంది. గర్భిణులకు వైద్య సేవలందించే విభాగం ఇరుగ్గా ఉండటంతో ఊపిరాడని పరిస్థితులున్నాయి. ఆసుపత్రిలో మూడు అంబులెన్సులు ఉన్నప్పటికీ ఒక్కటి మాత్రమే పూర్తిస్థాయి సేవలందిస్తోంది. మిగతా రెండింటికీ మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాల్సి ఉంది. మెరుగైన చికిత్స కోసం రోగులు, గర్భిణులను కరీంనగర్‌కు తరలించాలంటే డీజిల్ ఖర్చులు భరించాల్సి వస్తోంది.

నూతన భవనం ముందు రహదారి అధ్వానంగా ఉంది. నిర్వహణ లేకపోవడంతో ఆసుపత్రిలోని మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో చికిత్స కోసం వచ్చే రోగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వంట గది, మందుల నిల్వ గదుల కొరత ఉంది.

కీలక పాత్ర..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మొదలుకొని జిల్లా, బోధనాసుపత్రుల వరకు నిర్వహణలో అభివృద్ధి కమిటీలు కీలకపాత్ర పోషిస్తుంటాయి. ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో పాటు వివిధ వర్గాలవారు కమిటీ సభ్యులుగా ఉంటారు. గోదావరిఖనిలోని సార్వజనిక ఆసుపత్రి మాత్రం గత ఏడాది కాలంగా అభివృద్ధి కమిటీ లేకుండానే కొనసాగుతుంది. ప్రాంతీయ ఆసుపత్రి నుండి బోధనాసుపత్రిగా స్థాయి పెరగగానే 2022 మే 24న ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధి కమిటీని రద్దు చేశారు. బోధనాసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్‌ను నియమిస్తూ 2022 జూన్ 6న జీఓ జారీ అయింది. ఈ కమిటీలో జిల్లా పరిషత్తు ఛైర్మన్, ఆసుపత్రి పరిధిలోకి వచ్చే ఇద్దరు/ముగ్గురు శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, వైద్య విద్య సంచాలకులు, నగరపాలక మేయర్, కమిషనర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా ఆసుపత్రుల నిర్వహణ సమన్వయకర్త, వైద్య కళాశాల ప్రిన్సిపల్, రోటరీ/లయన్స్ క్లబ్ ప్రతినిధి, ఇండియన్ మెడికల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, రెసిడెంట్ మెడికల్ అధికారి, ముగ్గురు సీనియర్ ఆచార్యులు, ఛైర్మన్ నియమించే ఒక సీనియర్ వైద్యులు, వైద్య కళాశాల అలుమిని అసోషియేషన్ ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. హౌజ్ సర్జన్స్ పీజీ విద్యార్థుల ప్రతినిధి ఒకరు ప్రత్యేక ఆహ్వానితులుగా కొనసాగుతారు. ఇంతమంది సభ్యులుగా ఉండే కమిటీ పర్యవేక్షణతో ఆసుపత్రి నిర్వహణ మెరుగుపడుతుంది. ప్రస్తుతం కమిటీ లేకపోవడంతో అంతా ఏకపక్షంగా జరుగుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

# ఏటా వరద గోస.. పరిష్కారం చూపని యంత్రాంగం



వేములవాడ : ఏటా వర్షాకాలంలో గుడిసెల్లోకి వరద చేరి నిరుపేద కుటుంబాలు నిరాశ్రయులవుతున్నప్పటికీ అధికార యంత్రాంగం శాశ్వత పరిష్కారం చూపడం లేదు. దీంతో వారికి ఏటా వరద గోస తప్పడం లేదు. వేములవాడ పట్టణ శివారులోని కోనాయిపల్లి బుడగజంగాల కాలనీలోని నిరుపేదలు ఏటా వరద ముప్పు ఎదుర్కొంటున్నారు. వీరు భీమేశ్వర కాలువ పక్కన గుడిసెలు, రేకుల షెడ్లు వేసుకొని నివాసం ఉంటున్నారు. వర్షాలకు ఈ కాలువలోని వరద అంతా పొంగి ఈ కాలనీలోకి రావడంతో సమస్య ఏర్పడుతుంది.

కోనాయిపల్లి, విద్యానగర్ ప్రాంతాల్లో దాదాపు 50కి పైగా బుడగ జంగాల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వర్షాకాలంలో వరద కారణంగా కోనాయిపల్లి కాలనీలోని కుటుంబాలన్నీ ఇబ్బందులు పడుతున్నాయి. ఇటీవల వరుసగా నాలుగు రోజులు కురిసిన వర్షానికి గుడిసెలు, రేకుల షెడ్లలోకి వరద చేరి నిత్యావసర సరకులు, ఇతర సామగ్రి తడిసిపోయి నష్టం జరిగింది. వీరిని అధికార యంత్రాంగం సురక్షిత ప్రాంతానికి తరలించింది. ఏటా ఇదే సమస్య నెలకొన్నా అధికారులు శాశ్వత పరిష్కారం చూపకపోవడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కాలనీ ప్రజలకు రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేస్తామని చెబుతున్నారే తప్పా ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుడిసెల్లోకి నీరు చేరినప్పుడల్లా పాములు, తేళ్లు వంటి విష పురుగులతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.గుడిసె ముందు పిల్లలతో ఉన్న ఈమె పేరు శారద. ఇటీవల గుడిసెలోకి వరద చేరింది. దీంతో అక్కడి నుంచి కొంత దూరం ఎత్తు ప్రాంతానికి వెళ్లి గుడిసె వేసుకున్నారు. గత ఏడేళ్లుగా ఇదే పరిస్థితి. పాత సామగ్రి, చిత్తు పేపర్లు సేకరిస్తూ జీవనం సాగిస్తున్న ఈ కుటుంబానికి రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేస్తామని నేతలు, అధికారులు ఎప్పటి నుంచో చెబుతున్నారు. కానీ నేటికీ మంజూరు చేయలేదు. ఇలా గుడిసెలోనే బతుకుతున్నారు. ఈ ఒక్క కుటుంబమే కాదు. ఏకంగా 50కి పైగా కుటుంబాలది ఇదే పరిస్థితి.

రతిసారి ఇదే బాధ

వర్షాకాలంలో ప్రతిసారి ఇదే పరిస్థితి ఉంటుంది. మాకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు చెప్పి వెళ్లిపోతున్నారు. ఇప్పటికీ మంజూరు చేయలేదు. పక్కనున్న కాలువ నీరు అంతా ఇటు వైపు వచ్చి మా కాలనీని ముంచెత్తుతుంది. అడ్డుగోడ నిర్మిస్తే ఇంత నీరు రాదు.

స్వామి, బుడగజంగాల కాలనీ

ప్రభుత్వానికి నివేదిక పంపాం

వరద చేరుతున్న బుడగజంగాల కాలనీకి సంబంధించి సర్వే నివేదికను ప్రభుత్వానికి పంపాం. దాదాపు 30 కుటుంబాలకు ఇంటి ఖాళీ స్థలాలున్నాయి. మరో 24 కుటుంబాలకు ఇంటి స్థలాలు, ఇళ్లు లేవు. నిరాశ్రయులకు భోజన సదుపాయం ఏర్పాటు చేయడం జరుగుతుంది.

అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

# వంటింటికి ధరాఘాతం

నల్గొండ: అల్లం.. వెల్లుల్లి.. అల్లం వెల్లుల్లి.. కిలో వంద రూపాయలే.. అంటూ మైక్ పెట్టుకుని ఆటోలు, వ్యాన్లలో కాలనీల్లో తిరుగుతూ విక్రయించే వారు కనుమరుగయ్యారు. కారణం వాటి ధరలు ఆకాశాన్ని అంటడమే. రోజురోజుకూ కూరగాయల ధరలే కాకుండా ఇంట్లో వంటకాలకు వినియోగించే పదార్థాల ధరలు కూడా అమాంతం పెరిగిపోతున్నాయి. సామాన్యులు కొనుగోలు చేయలేని పరిస్థితికి ధరలు పెరిగిపోతున్నాయి. గత నెలలో కిలో రూ.240 వరకు పలికిన అల్లం వారం రోజులుగా కిలో రూ.320కి ఎగబాకింది. ఒక్కసారిగా రూ.80 పెరగడంతో సామాన్యులు అల్లం కొనలేని పరిస్థితి నెలకొంది. ఇతర రాష్ట్రాల నుంచి ఉమ్మడి జిల్లాకు అల్లం దిగుమతి అవుతోంది. ఈ ఏడాది డిమాండ్‌కు సరిపడా దిగుబడులు లేకపోవడం, ఉత్తరాది రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, రవాణా వ్యయం ఎక్కువ కావడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో దేశవ్యాప్తంగా వీటి ధరలు పెరిగాయని పేర్కొంటున్నారు. జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగానే ఇక్కడ విక్రయిస్తున్నామని చెబుతున్నారు. మొన్నటి వరకు వెల్లుల్లి కిలో రూ.120 పలకగా ప్రస్తుతం రూ.200కు చేరింది. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న అల్లం కూడా




నాణ్యతగా ఉండటం లేదు. పైకి చూస్తే మంచిగానే కనిపిస్తున్నా అందులో మొత్తం నీరే ఉంటుందని కొనుగోలుదారులు చెబుతున్నారు. వంటలకు అల్లం, వెల్లుల్లి అవసరం ఉండటంతో తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

# ఎల్లమ్మ చెరువుకు పర్యాటక సౌభాగ్యం

హుస్నాబాద్: కాకతీయుల కాలం నాటి హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు మినీ ట్యాంక్‌బండు సుందరీకరణ పనులు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభం అయ్యాయి. రూ.3 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనులను సద్దుల బతుకమ్మ పండుగలోగా పూర్తి చేయాలనే లక్ష్యంగా చేపట్టారు. ఇటీవల సంబంధిత ఇంజినీరింగు అధికారులు గుత్తేదారుతో మాట్లాడి పలు సూచనలు చేశారు. హుస్నాబాద్ పట్టణంతోపాటు, పరిసర గ్రామాల ప్రజలకు ఆహ్లాదం కలిగించే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందనుంది. 500 ఎకరాల శిఖం కల్గిన ఈ చెరువులో బోటింగు సదుపాయం కల్పించనున్నారు. కట్టపై పచ్చదనం, నడకదారి, మొక్కలు పెంపకం, రెయిలింగ్, బెంచీలు తదితరాలను ఏర్పాటు చేస్తారు. బతుకమ్మ రోజున మహిళలు ఆడుకునేలా ప్లాట్‌ఫాం నిర్మాణం చేయనున్నారు. మెట్ల వద్ద బతుకమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. కట్టపై 40 విద్యుత్తు దీపాలు బిగిస్తారు. సుందరీకరణ పనులు పూర్తవడానికి ఈ నిధులు సరిపోవని మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పురాధ్యక్షురాలు ఆకుల రజిత తెలిపారు.

చుట్టూ ఆలయాలు



రామవరంరోడ్ నుంచి కట్టపైకి సిమెంటు రహదారి నిర్మాణాన్ని టీయుఎఫ్ఐడీసీ ద్వారా చేపట్టనున్నారు. ఎల్లమ్మ చెరువు సమీపంలో వివిధ ఆలయాలు ఉన్నాయి. కాకతీయుల కాలంనాటి రేణుకా ఎల్లమ్మ దేవాలయం ఉంది. కట్టను ఆనుకుని ఉన్న ఏనెపై సిద్దేశ్వరుడు, అయ్యప్పస్వామి, సంతోషిమాత, ఆంజనేయుడు, మల్లికార్జునస్వామి ఆలయాలు ఉన్నాయి. సమీపంలో దర్గా ఉంది. వీటికి సమీపంలో శివ మార్కండేయ, సీతారామచంద్రస్వామి, పెద్దమ్మతల్లి, మడేలయ్య దేవాలయాలు ఉన్నాయి. చెరువు కింద పదిహేను వందల ఎకరాల్లో వరి, ఇతర పంటలు వేస్తారు. కనుచూపుమేర ఆహ్లాదకరంగా కనిపిస్తాయి. పనుల విషయమై రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగు డైరెక్టరు మనోహర్‌రావు గత వారం ఎల్లమ్మ చెరువును సందర్శించారు. చేపట్టె పనుల గురించి ఏఈ జీవన్‌రెడ్డితో చర్చించి సూచనలు చేశారు.

# మేలుకోక.. అవస్థలు తప్పవిక!

మెదక్: వర్షం కొందరికి మోదం.. మరికొందరికి ఖేదం కలిగించింది. ఐదురోజులుగా వాన ఎడతెరపి ఇవ్వలేదు. నీటి వనరులు కళకళలాడుతుండగా, పలు చోట్ల పనులు పూర్తవక ఇబ్బందులు ఏర్పడ్డాయి. మరమ్మతులు చేయించక అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఇక్కట్లకు గురవుతున్నారు. గతంలో సమస్య ఎదురవగా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇటీవలి వర్షాలకు పరిస్థితి పునరావృత్తమైంది. ఇకనైనా సంబంధిత శాఖల స్పందించాల్సిన అవసరం ఉంది.

ప్రమాదమని తెలిసినా..

జిల్లా కేంద్రం మెదక్ ప్రాంతీయ ఆసుపత్రిలో 2017లో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఆయా మండలాల నుంచి రోగులు ఇక్కడికి వస్తున్నారు. పది పడకలతో రోగులకు డయాలసిస్ చేస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలోని పాత భవనంలో కేంద్రం ఉండగా, వర్షానికి తడిసి ముద్దవడం, పడకల సంఖ్య పెంచడంతో పక్కనే ఉన్న మరో పాత భవనంలోకి మార్చారు. పది పడకలను అందుబాటులోకి తెచ్చారు. వర్షం కురిస్తే కేంద్రం జలమయం అవుతోంది. ఇటీవలి వానలకు ఆర్వో ప్లాంట్‌లో సీలింగ్ కూలింది. నీటిలోనే సిబ్బంది విధులు నిర్వర్తించారు. సీలింగ్ ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి. ఇటీవల ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, పాలనాధికారి రాజర్షిషా డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి మరో చోటికి మార్చాలని ఆదేశించారు. కానీ మరింత సమయం పట్టే అవకాశం ఉంది.

ఏడాదైనా స్పందించలేదు..



హవేలిఘనపూర్ మండలం వాడి నుంచి దూప్‌సింగ్ తండాకు వెళ్లేందుకు ఉన్న వంతెన తక్కువ ఎత్తులో నిర్మించారు. వర్షం కురిస్తే మునిగిపోయి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సమీపంలోని కామారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతాల నుంచి వరద ముంచెత్తుతోంది. గతేడాది వంతెన దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయి. మంత్రి హరీశ్‌రావు పరిశీలించి కొత్తది నిర్మించాలని ఆదేశించారు. రూ.3 కోట్లు మంజూరయ్యాయి గత ఏప్రిల్‌లో పనులు షురూ చేశారు. ఈ సారి వరద పెరగడంతో ఓ వైపు తెగిపోయింది. .

తూము ధ్వంసమై..

వెల్దుర్తి దేవతల చెరువు కింద 600 ఎకరాల ఆయకట్టు ఉంది. దీని తూము షట్టర్ ఇరుక్కుపోవడంతో నీళ్లు బయటకు వెళ్లడానికి వీల్లేకుండా పోయింది. దీంతో చెరువులో నీరు నిల్వ ఉండని దుస్థితి. గ్రామంలోని కుడి చెరువు తూము పూడుకుపోయి నెలలు గడుస్తోంది. నీళ్లు నిండుగా ఉండటంతో మరమ్మతులు చేయించలేని పరిస్థితి. గత వానాకాలంలో నీటిని విడుదల చేయకపోవడంతో పైపులు ఏర్పాటు చేసి గ్రావెలింగ్ పద్ధతిన తోడిపోసి ఆయకట్టుకు నీరందించారు. వేసవిలో మరమ్మతులకు అవకాశం ఉన్నా ఆ దిశగా చర్యలు శూన్యం. ఈ సారికూడా కిందికి వదలడానికి వీల్లేకుండా పోయింది. కాస్త ముందే మేల్కొని ఉంటే ఆయా చెరువుల ఆయకట్లకు నీరందేది.

ఏటా ముంపేవాన కురిసిందంటే నర్సాపూర్ పట్టణంలోని విఘ్నేశ్వర కాలనీవాసులు వణికిపోతున్నారు. కాలనీ పైభాగంలోకుంటను పూడ్చివేసినప్పటి నుంచి వానాకాలంలో కాలనీని వరద ముంచెత్తుతోంది. మురుగుతో పాటు, విష పురుగులుఇళ్లలోకి వస్తున్నాయి. దీంతో స్థానికులు నానాపాట్లు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా చర్యలు శూన్యం. ఇక్కడ రెండు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు మొదలు కాలేదు.

# క్రమబద్ధీకరణకు కసరత్తు..!

నల్గొండ: గ్రామ రెవెన్యూ సహాయకు (వీఆర్ఏ)ల వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో మూడు జిల్లాల అధికార యంత్రాంగాలు వారిని నీటిపారుదల, పంచాయతీరాజ్, పురపాలక, వ్యవసాయ, విద్యాశాఖల్లోని వివిధ స్థానాల్లో భర్తీ చేసేలా కసరత్తు ప్రారంభించాయి. ప్రస్తుతం పనిచేస్తున్న వారు ఎంత మంది?, అందులో ఏడు, పదోతరగతి ఆపైన చదువుకున్న వారు ఎంత?, డిగ్రీ ఆపైన ఎంత మంది ఉన్నారనే వివరాలను జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. 61 ఏళ్లు దాటిన వారు ఉంటే వారి వారసులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగమివ్వాలని నిర్ణయించడంతో ఆ వయసు వారు ఎంత మంది ఉన్నారనే దానిపై సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలో కొంత మంది సాగర్ ఎడమ కాల్వ, ఏఎమ్మార్పీ, మూసీ కాల్వలకు లష్కర్లుగా పనిచేస్తున్నారు. దీంతో వీరిని ఇతర విభాగాల్లో క్రమబద్ధీకరిస్తే కాల్వల కింద నీటి విడుదల సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో ప్రస్తుతం 2011 మంది వీఆర్ఏలు పనిచేస్తున్నారు. ఇందులో 25 శాతం అంటే సుమారు 400 మంది వరకు 61 ఏళ్ల పైబడిన వారున్నారని తెలిసింది. చాలా తక్కువ శాతంలో డిగ్రీ, ఆ పైన చదువుకున్న వారు ఉన్నారని, ఎక్కువగా పదోతరగతి లోపు చదివన వారే ఉన్నారని సంబంధిత వర్గాలుకు వెల్లడించాయి.



పక్షం రోజుల్లో పూర్తయ్యేలా..క్రమబద్ధీకరణ ప్రక్రియను వచ్చే నెల రెండో వారంలోగా పూర్తి చేయాల ని ఉన్నతాధికారులు మూడు జిల్లాల యంత్రాంగాన్ని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో వీఆర్ఏల వివరాలు, ప్రభుత్వం ప్రతిపాదించిన శాఖల్లో ఖాళీలు ఎన్ని ఉన్నాయనే దానిపై అధికారులు సమాచారం సేకరిస్తున్నారు. ఆయా శాఖల్లో క్రమబద్ధీకరణ సమయంలో వీఆర్ఏ సంఘాలతోనూ చర్చించాలని అధికారులు నిర్ణయించారు. కారుణ్య నియామకం కింద వారి వారసులు సుమారు 400 మందికి సైతం వారి విద్యార్హతలను బట్టి ఏ శాఖలో ఇవ్వాలనే దానిపైన కార్యాచరణ చేస్తున్నారు. 'క్రమబద్ధీకరణ ప్రక్రియను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో క్షేత్రస్థాయి నుంచి సమగ్ర వివరాలు సేకరిస్తున్నాం. వచ్చే నెల 15 వరకు ప్రక్రియ పూర్తవుతుంద'ని ఓ జిల్లా ఉన్నతాధికారికు వెల్లడించారు.

# చట్టం ఉంది... సాయమే లేదు

నల్గొండ:తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తు కోసం ఎన్నో కలలు కంటారు. వాటి సాకారానికి అష్ట కష్టాలు పడుతారు. అల్లారుముద్దుగా పెరిగిన పిల్లలే వృద్ధాప్యంలో అమ్మానాన్నలను భారంగా భావిస్తూ అనాథలను చేస్తున్నారు. కొందరైతే వారి నుంచి ఆస్తి మార్పిడి చేయించుకుని అనాథ ఆశ్రమాల్లో వదిలేస్తున్నారు. ఇలా పిల్లల నిరాదరణకు గురైన వయో వృద్ధుల సంక్షేమం, రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 2007లో చట్టం చేసింది. కానీ పోలీసు, రెవెన్యూ అధికారుల సమన్వయ లోపంతో బాధితులకు న్యాయం అందని ద్రాక్షగా మారింది. స్త్రీ, శిశు, వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 14567కు ఫోన్ చేసి సమస్య చెబితే వెంటనే స్పందిస్తున్నారు. సంబంధిత అధికారులను సమన్వయం చేసి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నా.. బాధితుల సంతానం వాటిని అమలు చేయడం లేదు. దీనిపై బాధితులు ట్రైబ్యునల్ అధికారి అయిన ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తే సకాలంలో విచారణ జరపడం లేదు. అక్కడక్కడ విచారించి ట్రైబ్యునల్ ఆదేశాలు ఇస్తున్నా కొన్ని కేసుల్లో కుటుంబ సభ్యులు పట్టించుకోవడం లేదు. దీనిపై తల్లిదండ్రులు పోలీసుల ఆశ్రయిస్తే వారు రాజీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఒంటరి మహిళలదీ ఇదే సమస్య. వారి ఇబ్బందులను తొలగించడానికి సఖీ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, పోలీసులు సకాలంలో స్పందించకపోవడంతో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయి. బాధితులకు మధ్యవర్తిత్వం వహించే అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఏం చేయాలో తెలియని స్థితి నెలకొంది. ప్రతివాదులు కోర్టుకు వెళ్లారనే పేరుతో కాలయాపన చేస్తున్నారు. వారంలో ఒక రోజు వయోవృద్ధుల కేసులు విచారించాల్సిన ట్రైబ్యునల్ అధికారులు నెలల తరబడి వాయిదాలు వేయడంతో వృద్ధుల సమస్యలు పేరుకుపోతున్నాయి.

ఇంటి నుంచి గెంటేయాలని చూస్తున్నారు: అంబటి స్వాతి, బాధితురాలు, నల్గొండ

ఇద్దరు పిల్లలు జన్మించాక, నా భర్త పవన్‌కుమార్ అనారోగ్యంతో 2021లో మృతి చెందారు. ఆయన మృతితో పుట్టెడు దుఃఖంలో ఉన్న నన్ను అత్తింటి వారు ఆస్తి ఇవ్వాల్సి వస్తుందని వదిలించుకోవాలని చూస్తున్నారు. నాపై అపనిందలు వేస్తూ దాడులకు పాల్పడుతున్నారు. నల్గొండ పట్టణంలోని మా ఇంటిలో ఇద్దరు పిల్లలతో ఉంటున్న నన్ను అత్త, ఆడపడుచులు, వారి భర్తలు కలిసి ఆస్తి కోసం ఇంటి నుంచి గెంటేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు దాడి చేసి కొట్టిన కేసులు నమోదయ్యాయి. నా ఇంటిలో నన్ను ఉండకుండా చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఇటీవల మానవ హక్కుల కమిషన్‌కు, హైకోర్టుకు ఫిర్యాదు చేశాను. నాపై దాడి చేశారని నేను పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులే వేధిస్తున్నారని అత్తింటివారు కోర్టును ఆశ్రయించి వారు పిలిస్తే స్టేషన్‌కు రావడం లేదు.

వసతి గృహం ఏర్పాటు చేయాలి..

భిక్షపతి, నల్గొండ ట్రైబ్యునల్ సభ్యుడు

పిల్లలు పట్టించుకోని వారిని చేరదీసి వైద్య సదుపాయాలు, నీడ కల్పించేందుకు వయోవృద్ధుల ఆవాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కేంద్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలో భవనం ఏర్పాటుకు రూ.50 లక్షలు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఇవ్వడం లేదు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఏడాదిగా స్థలం కోసం అధికారులు పరిశీలన చేస్తున్నారు. ట్రైబ్యునల్ ఆదేశాలను పోలీసులు అమలు చేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి.

మధ్యవర్తిత్వమే మంచి మార్గం: కృష్ణవేణి, స్త్రీ, శిశు,వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారిమా వద్దకు వచ్చే వారికి తగిన సలహాలు, సూచనలు ఇస్తూ సాయం చేస్తున్నాం. బాధితులు మధ్యవర్తిత్వంతో సమస్యలు పరిష్కరించుకోవాలని సూచిస్తున్నాం. టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసినా నేరుగా ఫిర్యాదు చేసినా వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. ట్రైబ్యునల్‌కు వస్తున్న కేసుల విచారణ త్వరగా పూర్తి చేయడానికి కృషి చేయాలని కోఆర్డినేషన్ సమావేశంలో కోరుతున్నాం. వృద్ధుల భవనానికి స్థలం కేటాయింపు పరిశీలనలో ఉంది.

# కలుషిత జలం.. వ్యాధుల గండం



ఖమ్మం :సత్తుపల్లి మండలం సదాశివపాలెంలోని తాగునీటి ట్యాంకు అపరిశుభ్రతకు చిరునామాగా మారింది. 15 రోజులకోసారి శుభ్రం చేయాల్సి ఉన్నప్పటికీ నెలల తరబడి పట్టించుకోవటం లేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. సుమారు 35 ఏళ్ల క్రితం ట్యాంకు నిర్మించారని, పెచ్చులు ఊడిపోతున్నాయని, అప్పుడప్పుడూ బురదనీరు వస్తుందని వాపోతున్నారు.

ఖమ్మం గ్రామీణ మండలం కాచిరాజుగూడెంలో గేట్ వాల్వ్ ఇలా తయారైంది. సుమారు 2,200 మందికి శుద్ధజలాలందించే గేట్ వాల్వ్ వరద నీటిలో చిక్కుకుంది. గేట్ వాల్వ్ తిప్పినప్పుడు పైప్‌లైన్ లీకేజీ ద్వారా మురుగునీరు లోపలికి వెళ్లి శుద్ధజలాల్లో కలిసి ఇళ్లకు సరఫరా అవుతుంది. అధికారులు పట్టించుకోకపోవడం వల్ల మిషన్ భగీరథ నీరు కలుషితమవుతోందని స్థానికులు చెబుతున్నారు.

అసలే వానాకాలం.. ఆపై వ్యాధుల భయం.. మిషన్ భగీరథ ట్యాంకుల పరిస్థితి అధ్వానంగా తయారవటంతో రోగాల ముప్పు పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయినా అధికారులు నీటిట్యాంకుల నిర్వహణపై దృష్టి సారించటం లేదని వాపోతున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఒక నగరపాలికతోపాటు 7 పురపాలికలు, సుమారు 900 పైచిలుకు గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇప్పటికీ అనేక పల్లెల్లో ట్యాంకులు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. కనీసం 15 రోజులకోసారి ట్యాంకులను శుభ్రపరచాల్సి ఉన్నా అధికారులు విస్మరిస్తున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. గేట్ వాల్వ్‌ల వద్ద పిచ్చిమొక్కలు పెరగటం, బురదనీరు స్తంభించటం వంటి సమస్యలు వేధిస్తున్నాయి. అనేకచోట్ల పైప్‌లైన్ల లీకేజీల పరంపరకు అడ్డుకట్టపడకపోవడంతో ప్రజలకు శుద్ధజలం మిథ్యగా మారింది.

నిధుల కొరత.. అధికారుల ఉదాసీనత..!

మిషన్ భగీరథ ట్యాంకుల నిర్వహణను అధికారులు గ్రామపంచాయతీలకు అప్పగించారు. ప్రతినెలా రెండుసార్లు ట్యాంకులను శుభ్రపరచాలనే నిబంధన అమలుకావటం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో నిధులు లేకపోవటం, మరికొన్నిచోట్ల పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతో ఈపరిస్థితి తలెత్తుతోంది. పురపాలికల్లోనూ ట్యాంకులను నిబంధనల ప్రకారం శుభ్రపరచటం లేదు. దస్త్రాల్లో మాత్రం నెలకు రెండు, మూడుసార్లు శుభ్రం చేసినట్లు చూపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగర, పురపాలికల్లో మంచినీటి నాణ్యతను కొలిచే ల్యాబ్‌లున్నా సక్రమంగా పరీక్షలు జరగడం లేదు. చాలాచోట్ల మిషన్ భగీరథ పైపులు లీకవుతున్నాయి. ఎయిర్ వాల్వ్‌ల పైపులు తుప్పుపడుతున్నాయి. వర్షాకాలంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తాగునీటి సరఫరాపై పాలకులు, అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

'నిబంధనల ప్రకారం ట్యాంకులను శుభ్రపరుస్తున్నాం. మిషన్ భగీరథ పైపులు లీకవుతున్నట్లు సమాచారమందితే మరమ్మతులు చేయిస్తున్నాం. వానాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగటం మంచిది' అని అధికారులు చెబుతున్నారు.

# వానకు తడుస్తూ.. తుప్పు పడుతూ!



రామగుండం: లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలు వానకు తడుస్తూ ఎండకు ఎండుతూ దుమ్మూధూళితో తుప్పు పడుతున్నాయి. రైల్వేశాఖ కనీస చర్యలు చేపట్టడం అటుంచితే గంటలు, రోజులు, నెలవారీ చొప్పున తమ నుంచి ముక్కుపిండి మరీ జీఎస్టీ పన్నుతో కలిపి వాహన పార్కింగ్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని రైలు ప్రయాణికులు గగ్గోలుపెడుతున్నారు. రామగుండం రైల్వేస్టేషన్ ఎదుట విశాలమైన స్థలం ఉన్నా పార్కింగ్ షెడ్ల నిర్మాణానికి నోచుకోవడంలేదు. రైల్వేస్టేషన్ ఏర్పాటు చేసి వందేళ్లు దాటింది. నేటికీ చెట్లకింద లేదా ఎండలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలను నిలుపుతున్నారు. ద.మ.రై. సికింద్రాబాద్ డివిజన్‌తోపాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అతి పెద్ద రైల్వేస్టేషన్ రామగుండం. రవాణాపరంగా ప్రతిరోజూ భారీ ఆదాయం రైల్వేశాఖకు సమకూరుతోంది. నిత్యం వేలమంది ప్రయాణికులు సూపర్‌ఫాస్టు, ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లలో ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వేస్టేషన్ ఎదుట ప్రధాన రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేసేందుకు ఎలాంటి సదుపాయం లేకపోవడంతో ప్రయాణికులు తప్పనిసరిగా స్టేషన్‌లోని పార్కింగ్‌లోనే వాహనాలు నిలుపుతున్నారు. రేకుల షెడ్లు నిర్మించి వాహనాలకు నీడ కల్పించాలని జనరల్ మేనేజర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదని పలువురు ప్రయాణికులు అంటున్నారు. స్టేషన్ తనిఖీ సందర్భంగా పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించే అధికారులు షెడ్లు నిర్మిస్తామని చెబుతారే కానీ ఆచరణలో అమలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు లేదా మూడు రోజులపాటు వాహనాలను పార్కింగ్ ప్రదేశంలోనే నిలిపితే మొత్తం దుమ్ముతో నిండిపోతున్నాయి. కనీసం టార్పాలిన్లు కప్పాలని లేదా తడకలతో పందిరి వేయాలని కోరినా గుత్తేదారు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు వాపోతున్నారు. రేకులతో పార్కింగ్ షెడ్లు నిర్మిస్తే తక్కువ వ్యయం అవుతుందని, తమ వాహనాలు పాడవకుండా ఉంటాయని అంటున్నారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి షెడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

# పిలిచినా రావడం లేదు

సిరిసిల్ల : వసతి గృహాల మరమ్మతులు.. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం.. యువకులు చదువుకునేందుకు గదులకు ప్రత్యేకంగా డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు) నిధులను 2018-21 మధ్య కాలంలో రూ. 2.01 కోట్లు కేటాయించారు. ఈ పనుల్లో పురోగతి లేదు. నిధులున్నా నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఆరుసార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారుల నుంచి స్పందన లేదు. ఇవన్నీ చిన్న చిన్న పనులు కావడమే ఇందుకు కారణం. పనులు పూర్తయ్యాక చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. ఇటీవల కలెక్టర్ అనురాగ్ జయంతి పలు వసతి గృహాలను సందర్శించారు. అక్కడున్న వసతులు, భోజనాల నాణ్యతపై సిబ్బందితో మాట్లాడారు. సిరిసిల్ల పట్టణం చిన్నబోనాల, తంగళ్లపల్లి మండలం నేరెల్ల, ముస్తాబాద్‌లోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మరుగుదొడ్లు, తలుపులు, కిటికీలు, తాగునీటి నల్లాలకు మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి అని ఆయా వసతి గృహాల సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నిధుల కేటాయింపు, పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులతో ఆరా తీశారు. నాలుగేళ్ల క్రితం నిధులు కేటాయించినా పనులు జరగలేదని తేలింది.

జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు.. కేజీబీవీలు.. పంచాయతీల్లో అంతర్గతర రహదారులు.. ప్రధాన కూడళ్లలో వీధి దీపాలు.. సామాజిక భవనాల నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించారు. వీటితో మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో గంభీరావుపేట, ముస్తాబాద్, సిరిసిల్ల, వీర్నపల్లి, బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో యువకులు చదువుకునేందుకు రీడింగ్ గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సమాఖ్య, సామాజిక భవనాల నిర్మాణాలు ఉన్నాయి.

గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం పూర్తయింది. అలాగే ముచ్చర, ముచ్చర్లతండాలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. తంగళ్లపల్లి మండలం రామన్నపల్లిలో భూగర్భ డ్రైనేజీ, అంతర్గత రహదారి పనులకు మోక్షం లభించలేదు.

చందుర్తి, గంభీరావుపేట, కోనరావుపేటలోని కేజీబీవీల్లో మరుగుదొడ్ల మరమ్మతులకు రూ. 5.48 లక్షలు, ముస్తాబాద్, రుద్రంగి, వీర్నపల్లి, వేములవాడలోని కేజీబీవీల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా, శుద్ధ



జలకేంద్రాల ఏర్పాటుకు రూ. 12.35 లక్షలు కేటాయించారు. వీటిలో ఎక్కడా పనులు ప్రారంభం కాలేదు. మోడల్ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ, ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు, శుద్ధజల కేంద్రాల ఏర్పాటు, మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.77.15 లక్షలు కేటాయించారు.

గుత్తేదారులు పనులు చేసేందుకు ముందుకు రాకపోవడంతో ఈ నిధులను టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ (తెలంగాణ రాష్ట్ర పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ)కు అప్పగించారు. టెండర్లు పిలవకుండా నేరుగా గుత్తేదారు సంస్థలకు అప్పగించేలా ప్రణాళికలు చేస్తున్నారు. దానిలో భాగంగా తొలుత వసతి గృహాల్లోని మరమ్మతులను పరిశీలిస్తున్నారు. ముందుకొచ్చిన వారికి పని మొత్తంలో 25 శాతం నేరుగా చెల్లించి, మిగతావి పని పూర్తయ్యాక చెల్లించేలా ప్రణాళికలు చేస్తున్నారు.

ఒక్కొక్కటిగా పూర్తి చేస్తాం

పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. మేమే కొంత మందిని గుర్తించి వారికి పనులు అప్పగించేలా చూస్తున్నాం. వీరికి ముందుగా చేయాల్సిన పనులను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి చూపిస్తున్నాం. ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్కటిగా పూర్తి చేయిస్తాం. సమ్మిరెడ్డి, డీఈ, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ

# సర్దుబాటు!

భువనగిరి : సర్కారు బడుల్లోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు ప్రక్రియను విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా అవసరమున్న పాఠశాలల్లో 215 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 712 ప్రభుత్వ పాఠశాలల్లో 43,344 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గతంలో చేపట్టిన ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణను ఉపాధ్యాయ సంఘాల నాయకులు వ్యతిరేకించడంతో గుట్టుచప్పుడు కాకుండా సర్దుబాటు పేరిట ఉపాధ్యాయులను అవసరం ఉన్న పాఠశాలల్లో నియమించారు. హేతుబద్ధీకరణ ప్రక్రియతో పాఠశాలల రద్దు కావడంతో పాటు ఉపాధ్యాయుల పోస్టులు రద్దవుతాయని ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనికి తోడు ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు ఆసక్తి తగ్గడంతో ఏటేటా విద్యార్థుల ప్రవేశాల సంఖ్య గణనీయంగా తగ్గుతుండటం గమనార్హం.

నాణ్యమైన విద్యాబోధన:నారాయణరెడ్డి, డీఈవో

ఉపాధ్యాయుల అవసరం ఉన్న పాఠశాలలకు అక్కడి అవసరాలను బట్టి సర్దుబాటు చేసి నియమించాం. అన్ని పాఠశాలల్లో విద్యా బోధ%రి%న మెరుగుపడనుంది. ఉన్నత విద్యార్హతలు ఉండి ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలల్లో నియమించాం. ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి జారీ కావాల్సి ఉంది. సర్దుబాటులో భాగంగా నియమించిన ఉపాధ్యాయులు వరుస సెలవుల కారణంగా నియమించిన ప్రాంతాల్లో కొంత మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరలేదు. త్వరలోనే వారు విధుల్లో చేరుతారు.

ఇదీ పరిస్థితి

ఉపాధ్యాయుల సర్దుబాటుతో పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు మూతపడే అవకాశం ఉంది. ఇప్పటికే 45 పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో మూసివేశారు. ప్రస్తుతం చేపట్టిన సర్దుబాటుతో మరికొన్ని గ్రామాల్లోని పాఠశాలలు మూతపడటంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. మూత పడిన పాఠశాలల్లో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యాలయాలు, ప్రాంగణాల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. సర్దుబాటు పేరిట ప్రాథమిక పాఠశాలల్లో బోధించే ఎస్‌జీటీ ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలల్లో నియమించడం విమర్శలకు తావిస్తోంది. ప్రాథమిక విద్యార్థులకు బోధించాల్సిన ఉపాధ్యాయులు ఉన్నత తరగతులు ఎలా బోధిస్తారని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. భువనగిరి గంజ్ ఉన్నత పాఠశాలలో నాలుగు సబ్జెక్ట్ టీచర్ల పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్నాయి. సర్దుబాటు పేరిట ఇదే పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడిని నియమించినప్పటికి విధుల్లో చేరలేదు. జిల్లాలో 3,147 మంది ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం 2,660 మంది పనిచేస్తున్నారు. ఏళ్ల తరబడి పోస్టులు ఖాళీగా ఉండటంతో పాఠశాల నిర్వహణ, విద్యా బోధనపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ కారణంగా ఏటేటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ప్రవేశాలు తగ్గుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పోస్టులను భర్తీ చేయాలి:భాస్కర్, డీటీఎఫ్, రాష్ట్ర కార్యదర్శి

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. విద్యార్థులు లేరన్న సాకుతో పాఠశాలలలను మూసివేయడం సరికాదు. ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించి వాటిపై తల్లిదండ్రుల నమ్మకాన్ని పెంచాలి. ప్రస్తుతం పలు పాఠశాలల్లో పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులు లేక బోధన కంటుపడుతోంది.

# వీధుల్లో శునకాలు..కానరాని నియంత్రణ చర్యలు

సూర్యాపేట : జిల్లాలోని పురపాలికల్లో శునకాల సంతతి నియంత్రణ చర్యలు చేపట్టడం లేదు. ఎక్కడైనా సామాన్యులపై కుక్కలు దాడి చేసినప్పుడే అధికారులు హడావుడి చేస్తున్నారే తప్ప నివారణపై దృష్టిసారించడం లేదు. దీంతో పురపాలికల్లో శునకాల బెడద రోజురోజుకూ తీవ్రమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా గుంపులుగుంపులుగా తిరుగుతుండటం, రాకపోకలు సాగించే వాహనాల వెంట పడుతుండటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కో వీధిలో పాతిక సంఖ్యలో కుక్కలు ఉండటంతో విద్యార్థులు, మహిళలు ఒంటరిగా బయటికి వెళ్లేందుకు భయపడుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలు ఉండగా.. నల్గొండలో 2000, సూర్యాపేటలో 501 వీధి కుక్కలకు మాత్రమే సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయడం విశేషం. మిగతా పురపాలికల్లో ఎక్కడా చర్యలు తీసుకోవడం లేదు.

చర్యలు శూన్యం

పురపాలిక వాసుల నుంచి కుక్కల బెడదపై ఫిర్యాదులు వస్తుండగా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పైగా వాటిని పట్టుకొని శస్త్ర చికిత్సలు చేసే పరిస్థితి కూడా పోయింది. మూడు నెలల నుంచి ఈ ప్రక్రియ నిలిచిపోగా సంబంధిత అధికారులు దీనిపై మాట్లాడేందుకు నిరాకరిస్తున్నారు. ఏదీ మాట్లాడినా జంతు సంరక్షణ బోర్డుకు సమాధానం చెప్పాల్సి వస్తోందని చెబుతున్నారు. దీంతో మొత్తానికి పురపాలికల్లో శునకాల నియంత్రణ చర్యలు అటకెక్కాయి.

నిలిచిన సంతతి నియంత్రణ శస్త్ర చికిత్సలు

పురపాలికల్లోని వీధి కుక్కల నియంత్రణ విషయంలో ఎనిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ప్రోగ్రాం జంతు సంరక్షణ బోర్డు ఆఫ్ ఇండియా నియమ, నిబంధనలు విధించింది. కాలనీల్లోని కుక్కలను పట్టుకొని ఏబీసీ కేంద్రానికి తరలించడం, సంతానోత్పత్తి కలగకుండా శస్త్రచికిత్స చేయాలి. తిరిగి అదే ప్రాంతంలో వదిలిపెట్టాలి. ఇందుకు నాలుగైదు రోజుల సమయం పడుతుంది. ఈ పనికి ఒక్కో కుక్కకు రూ.1650 చొప్పున చెల్లిస్తున్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల్లో 2501 శునకాలకు మాత్రమే శస్త్ర చికిత్సలు చేశారు. పురపాలికల్లో తప్పుడు లెక్కలు చెబుతుండటంతో జంతు సంరక్షణ బోర్డుకు ఫిర్యాదులు వెళ్లడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియంత్రణ చర్యలు నిలిచిపోయాయి. మూడునెలలుగా ఎక్కడా కుక్కల సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు జరగడం లేదు. దీంతో సంతానం పెరిగి వార్డుల్లో గుంపులుగా సంచరిస్తున్నాయి.

రవాణా సమస్యతో చికిత్స జాప్యం వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

హుజూనగర్‌లో కుక్కల సంతతి నియంత్రణ శస్త్రచికిత్స కేంద్రం లేదు. జిల్లాలో సూర్యాపేట పురపాలికలో మాత్రమే ఉంది. అక్కడికి తీసుకెళ్లేందుకు రవాణాపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో కొంత ఆలస్యమైంది. త్వరలో శస్త్రచికిత్సలు చేయిస్తాం.

# విజయ డెయిరీ.. వివాదాలపాలు

ఖమ్మం : ప్రభుత్వరంగ సంస్థ 'విజయ డెయిరీ' తరచూ వివాదాల పాలవుతోంది. అనుభవం, అర్హతలేని వారి వల్ల సంస్థకు నష్టం వాటిల్లుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెగ్యులర్ ఉద్యోగులు చాలామంది సస్పెన్షన్‌కు గురయ్యారు. ల్యాబ్‌లో పనిచేసే పొరుగు సేవల సీనియర్ ఉద్యోగులు ముగ్గురిని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తాజాగా బదిలీ చేయటం, వీరి స్థానంలో ప్రైవేటు డెయిరీల్లో పనిచేసే నలుగురిని అనుమతులు లేకుండా నియమించ



కోవటం అనుమానాలకు తావిస్తోంది. కొత్తగా నియమితులైన వారి ద్వారానే అక్రమాలకు పాల్పడుతున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎలాంటి అక్రమాలు జరగలేదు. గతంలో ఆరోపణలు ఎదుర్కొన్న వారిపై విచారణ జరిపించి కొందరు పొరుగుసేవల ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేశాం. డెయిరీని పటిష్ఠపరిచేందుకే కొంతమందిని కొత్తగా పొరుగుసేవల ఉద్యోగులుగా నియమించాం. అంతే తప్ప నియామకాల్లో అక్రమాలకు పాల్పడలేదు. సంస్థను దెబ్బతీసేందుకు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కుమారస్వామి, డిప్యూటీ డైరెక్టర్, విజయడెయిరీ, ఖమ్మం

# వేసవిలో వన్యప్రాణికి రక్ష

సత్తుపల్లి : భవిష్యత్తు తరాల మనుగడకు అడవులు ఎంతో అవసరం. వన్యప్రాణులను కాపాడుకోవడమూ అంతే కీలకం. వేసవి వచ్చిందంటే చాలు దాహార్తితో జనారణ్యంలోకి వచ్చి మృత్యువాత పడుతున్నాయి. అగ్నికీలల్లో ఆహుతి అయిపోతున్నాయి. వీటి నివారణే లక్ష్యంగా ప్రతి వేసవిలో అటవీశాఖ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. వన్యప్రాణుల దాహం తీర్చడంతోపాటు అడవుల సంరక్షణకు విశేష కృషి చేస్తోంది.

దాహార్తి తీరుస్తూ..

అడవుల్లో ప్రధానంగా ఫైర్‌లైన్లు ఏర్పాటు చేస్తూ వృక్ష, జంతుజాలానికి రక్షణ కల్పిస్తున్నారు. మరోవైపు వన్యప్రాణుల సౌకర్యార్థం అదనంగా నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌లు, ఫారంపాండ్లు, సాసర్ రింగ్స్, సోలార్ బోర్ వెల్స్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. పదిహేను రోజులకోసారి సాసర్ రింగ్స్‌లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. హరితహారంలో భాగంగా పచ్చదనాన్ని వృద్ధి చేయడం కోసం అటవీ శాఖ చేపట్టిన కృషి ఫలించింది. పక్షులు, జంతువుల మనుగడకు ఉమ్మడి జిల్లాలోని అడవులు దోహదపడుతున్నాయి. వాటి జీవనానికి అవసరమైన వాతావరణం నెలకొనడంతో వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరిస్తూ వాటి సంతతిని మరింతగా పెంచుకుంటున్నాయి. ఖమ్మం డివిజన్ పరిధిలోని మధిర, ఖమ్మం, కారేపల్లి, కూసుమంచి రేంజ్‌ల పరిధిలో 30,889.60 హెక్టార్లు, సత్తుపల్లి డివిజన్ పరిధిలోని తల్లాడ, సత్తుపల్లి రేంజ్ పరిధిలో



మరో 33,052.94 హెక్టార్లలో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతంలో అధికారులు ఈ వేసవిలో పకడ్బందీగా చర్యలు చేపట్టారు. 2021లో పెద్దపులి సైతం ఈ ప్రాంతంలో తిరగడంతో సదరు జాతికి అనుకూలంగా ఇక్కడి అడవులు రూపొందించినట్లుగా అధికారులు భావిస్తున్నారు.

స్వేచ్ఛగా సంచరించేలా..

ఉమ్మడి జిల్లాలోని దట్టమైన అడవుల్లో వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఎక్కువగా అడవి దున్నలు, దుప్పులు, కొండగొర్రెలు, కుందేళ్లు, అడవి పిల్లులు, రెండు రకాల పునుగు పిల్లులు, జింకలు, దుప్పులతోపాటు పక్షులు పెద్దఎత్తున సంచరిస్తున్నాయి. హరితహారంలో భాగంగా అడవుల్లో దాదాపు శాఖాహార జంతువులు, పక్షుల కోసం ఎక్కువగా శాతం నేరేడు, ఉసిరి, మారేడు, వెలగ, చింత, వేప, రావి, మర్రి వంటి పండ్ల మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా పలు ప్రాంతాల్లో ఎరుమద్ది, నల్ల మద్ది, సిందుగ, లోలుగ, ఏగిస వంటి విత్తనాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఖమ్మం జిల్లాలో...2022–23లో మొత్తం 97 కి.మీ. నిడివిలో కొత్తగా ఫైర్‌లైన్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఫైర్‌లైన్ పనులు కొనసాగుతున్నాయి. గతంలో ఉన్న 272 కి.మీ. మేర ఫైర్‌లైన్లను నిర్వహిస్తున్నారు. గతేడాదిలో 61 సాసర్ పిట్స్‌ను ఏర్పాటు చేయగా ప్రస్తుతం పలు ప్రాంతాల్లో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఉన్న 120 సాసర్ పిట్స్‌ను మరమ్మతులు చేయించి కొనసాగిస్తున్నారు. మూడు చెక్ డ్యామ్‌లు, ఒక సోలార్ బోర్‌వెల్, 599 రాతి ఆనకట్టలు, పది పెర్కోలేషన్ ట్యాంకులు, 14 నీటికుంటలు ఉండగా అవసరమైన ప్రాంతాల్లో గుర్తించి అదనంగా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తం

అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాల నివారణకు అధికారులు పలు చర్యలు చేపడుతున్నారు. సమీపంలో నివసిస్తున్న వారికి అడవుల ప్రాముఖ్యతను తెలుపుతూ అవగాహన కల్పిస్తున్నారు. కాపరులు కేవలం పశువుల మేత మేపేందుకు మాత్రమే అనుమతిస్తూ ఇతరులు అడవుల్లోకి వెళ్లకుండా బేస్ క్యాంపు సిబ్బందిచే చర్యలు చేపట్టారు. అడవుల్లో తేనె తీసేవారు, తునికాకు కార్మికులతో అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. మంటలు వ్యాపించకుండాఫైర్‌లైన్ల నిర్వహణపై దృష్టిపెట్టారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే శాటిలైట్ ద్వారా వచ్చే మెసేజ్ అలర్ట్‌తో ఆ ప్రాంతానికి చేరుకుని మంటలను నివారించేలా ఫైర్ బోయర్లను అందుబాటులో ఉంచారు. వన్యప్రాణుల కదలికలు గుర్తించడం కోసం నీటి కుంటల వద్ద కెమెరా ట్రాప్స్ అమర్చుతున్నారు.

సంరక్షణ బాధ్యత అందరిది

అడవులు, వన్యప్రాణుల సంరక్షణ బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అడవులు, వన్యప్రాణుల రక్షణ కోసం పలు విధాల ఏర్పాట్లు చేస్తున్నాం. హరితహారాన్ని అందిపుచ్చుకుని పలు మారుజాతి మొక్కలతో పచ్చదనాన్ని వృద్ధి చేశాం. అడవులు, వన్యప్రాణులకు ముప్పు కల్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. వెంకటేశ్వర్లు, రేంజర్, సత్తుపల్లి

# అనుసంధానం వేగవంతం



ఖమ్మం : హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓడరేవులు కలిగిన విశాఖపట్నం, కాకినాడ పట్టణాల అనుసంధానానికి దగ్గర దారి నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఖమ్మం–దేవరపల్లి మధ్య 162 కి.మీ. పొడవున నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి పూనుకుంది. ఏపీలో భాగమైన రోడ్డు నిర్మాణ పనులకు గతంలోనే శంకుస్థాపన జరిగింది. తెలంగాణలో భాగమైన ఖమ్మం–దేవరపల్లి రోడ్డుకు ప్రధాని మోదీ హైదరాబాద్‌లో శంకుస్థాపన చేయనున్నారు.

నిర్మాణం పూర్తయితే..గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పూర్తయితే హైదరాబాద్–విశాఖపట్నం, కాకినాడ మధ్య సరకు రవాణా వేగవంతమవుతుంది. ప్రస్తుతం విజయవాడ మీదుగా వాహనాలు వెళుతున్నాయి. కొత్త రోడ్డు అందుబాటులోకి వస్తే సుమారు 80 కి.మీ. దూరం తగ్గుతుంది. తెలంగాణలో ఖమ్మం– హైదరాబాద్ మధ్య ఈ రోడ్డుకు అనుసంధానంగా డ్రైపోర్ట్‌ల ఏర్పాటుకు అవకాశాలు మెరుగుపడతాయి.

ప్రతి ప్యాకేజీలో పనులు పూర్తి చేసేందుకు రెండేళ్ల గడువు విధించారు. 2022 సెప్టెంబర్, అక్టోబర్ చివరన నిర్మాణ సంస్థలు పనులు ప్రారంభించాయి. 2024 నవంబర్ నాటికి పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు.

జాతీయ రహదారి వివరాలు

జిల్లాలో 105.23 కి.మీ. పొడవున నాలుగు వరుసల్లో రోడ్డు నిర్మించనున్నారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్ వరకు ఉన్న సూర్యాపేట– ఖమ్మం జాతీయ రహదారికి కొనసాగింపుగా పొన్నేకల్ నుంచి వెంకటగిరి క్రాస్‌రోడ్డు, గుదిమళ్ల నుంచి మున్నేరు మీదుగా ఖమ్మం అర్బన్, చింతకాని, కొణిజర్ల, వైరా, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలం తుంబూరు వరకు రోడ్డు నిర్మిస్తారు. తుంబూరు తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చింతలపుడి మండలం లింగగూడెంలో ప్రవేశించి దేవరపల్లి వరకు కొనసాగి అక్కడ విజయవాడ, కొవ్వూరు జాతీయ రహదారికి అనుసంధానమవుతుంది. ఖమ్మం జిల్లాలో నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా విభజించారు. రూ. 2,760.85 కోట్లతో గుత్తేదారు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. జిల్లాలో ఏడు మేజర్ వంతెనలు, 30 మైనర్ వంతెనలు, ఒక ఆర్వోబీ నిర్మించనున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేపైకి వాహనాలు ప్రవేశించేందుకు ఐదు ఇంటర్ ఛేంజెస్ మార్గాలు ఏర్పాటుచేస్తారు. ఖమ్మం– దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఎన్‌హెచ్–365 బీజీ నంబర్ కేటాయించారు.

రోడ్డు నిర్మాణానికి జిల్లాలో 1,300 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించారు. భూమి కోల్పోయిన వారికి రూ. 419 కోట్ల పరిహారం చెల్లించాలి. రూ. 411 కోట్లు పంపిణీ చేశారు. మిగతా ప్రక్రియ కొనసాగుతోంది.

రోడ్డు నిర్మాణానికి 2018 మేలో ప్రధానమంత్రి ఆమోదించారు. మూడు పంటలు పండే భూములు ఇచ్చేందుకు తొలుత రైతులు నిరాకరించారు. రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు. కొవిడ్ సమయంలో భూ సేకరణ ప్రక్రియ నెమ్మదించినా తదనంతరం పోలీసు బందోబస్తు మధ్య రైతులు భూములు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు ఆహ్వానించి గుత్తేదారు సంస్థలను ఖరారు చేశారు.

# పాతాళానికి గంగ.. పట్టణాల్లో బెంగ



ఖమ్మం : జల్‌శక్తి అభియాన్ పేరిట భూగర్భజల సంరక్షణకు 2017 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాన్ని అమలుచేస్తున్నాయి. రైతులు, గ్రామీణులు, పట్టణ వాసుల్లో అవగాహన కల్పిస్తున్నాయి. భద్రాద్రి జిల్లాలో 3,125, ఖమ్మం జిల్లాలో 1,683 జలవనరులున్నట్లు కేంద్ర జల్‌శక్తి శాఖ తాజాగా విడుదల చేసిన తొలి వాటర్‌బాడీస్ సెన్సస్ నివేదిక చెబుతోంది. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లో భూగర్భజలం తక్కువ ఉన్నట్లు స్పష్టమవుతోంది. పట్టణ జనాభా విస్తరించడం, కాంక్రీటు నిర్మాణాలు పెరగడం, నివాసాల్లో ఇంకుడుగుంతలు లేకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఏటా కురుస్తున్న వర్షాలకు జలవనరులు నిండకపోగా.. సహజసిద్ధంగా ఏర్పడిన వనరుల్లో సైతం జలం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నివేదికలోని ముఖ్యాంశాలు.. ఉభయ జిల్లాల్లో అనేక చెరువులు ఆక్రమణల చెరలో ఉన్నాయి. సహజసిద్ధంగా ప్రవహించే వాగులు సైతం ఆక్రమణలకు గురయ్యాయి. కొన్నింటి దారి మళ్లింది. 2017–18 నాటి గణాంకాల ఆధారంగా నీటి నిల్వలను లెక్కించగా జలవనరుల్లో 42% సగభాగం, 25% పూర్తిగా, మూడోవంతు 23%, నాలుగోవంతు 10% నిండి ఉన్నాయి. ఆక్రమణకు గురైన వాటిలో చెరువులు 18%, కుంటలు 27%, నీటి సంరక్షణ పథకాలు 33%, చెక్‌డ్యాంలు 22% ఉన్నాయి. అందుబాటులో ఉన్న జలవనరుల్లో 73% వినియోగంలో ఉండగా 27% నిరుపయోగంగా మారాయి. ఎండిపోవడం, పూడికతీత లేకపోవడం, ఉప్పు, ఇతర ద్రవాల శాతం ఎక్కువగా ఉండటం వల్ల జలవనరులను వినియోగించటం లేదు. ఎక్కువగా సాగునీటికి (55.30%), తర్వాత భూగర్భజలాల రీఛార్జ్‌కు (38.52%) ఉపయోగపడుతున్నాయి.

# ఆరంభంలోనే తగ్గిన ధర

జగిత్యాల : మామిడి సీజన్ ఆరంభంలోనే ధరలు అమాంతం తగ్గటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బంగినపల్లి రకానికి కిలోకు రూ. 60–70 వరకు పలికిన ధరలు ప్రస్తుతం రూ. 40 కన్నా దిగువకు పడిపోవటంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కాయలను కొనుగోలు చేసిన వ్యాపారులు గ్రేడింగ్, ప్యాకింగ్‌చేసి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుండగా మామిడి కాయల క్రయవిక్రయాలు పెరిగే తరుణంలో ధరాఘాతం వేధిస్తోంది. తగ్గిన కాతజ జగిత్యాల జిల్లాలో 35 వేల ఎకరాల్లో మామిడి కాపు ఉండగా 1.32 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావాలి. ఈ సీజన్‌లో తొలుత పూత బాగానే వచ్చినా చలి, ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, తేనెమంచు, బూడిద తెగులు, తామర పురుగుల ప్రభావం, రాళ్లవానలు, అకాలవర్షం, ఈదురు గాలులతో పూత, పిందెలు పెద్దఎత్తున రాలిపోయాయి. తోటనుబట్టి సగం వరకు పూత, పిందె రాలిపోయి నష్టం వాటిలినట్లు రైతులు, తోటల గుత్తేదారులు పేర్కొనటం ప్రతికూల పరిస్థితిని వెల్లడిస్తోంది. ఈ నేపథ్యంలో మామిడి మండీకి కూడా కాయలు చాలా తక్కువగానే అమ్మకానికి వస్తాయని అంచనా వేస్తుండగా గత కొన్ని సీజన్లుగా మామిడికి ప్రతికూల వాతావరణం నెలకొని దిగుబడులు గణనీయంగా తగ్గుతుండటంతో గొల్లపల్లి తదితర మండలాల రైతులు తోటలను పెద్దఎత్తున నరికివేసి ఇతర పంటలకు మళ్లుతున్నారు.

కాయల ఎగుమతి

జగిత్యాలతో పాటుగా మెట్పల్లి, కోరుట్ల, మేడిపల్లి, రాయికల్, గొల్లపల్లి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు కాయలను కొనుగోలు చేస్తారు. మార్కెట్లతో పాటుగా నేరుగా తోటల నుంచి కూడా కాయలను సేకరించి పెట్టెల్లో నింపి తరలిస్తారు. స్థానికంగా ధరల్లేనపుడు రైతులు కూడా తమ కాయలను నాగ్‌పూర్, హైదరాబాద్ తదితర మార్కెట్లకు తీసుకెళ్లి విక్రయిస్తారు. ఈ నేపథ్యంలో చల్‌గల్‌లో లక్ష చదరపు అడుగుల్లో సిద్ధమైన షెడ్లు అందుబాటులోకి రావటం, వాలంతరి ప్రదర్శనక్షేత్రం నుంచి తీసుకున్న స్థలాన్ని దశలవారీగా అభివృద్ధి చేయనుండటం కలిసివచ్చే అంశాలుగాఉన్నా ధరాఘాతం రైతులను, తోటల గుత్తేదారులను వేధిస్తోంది. అకాలవర్షాల భయంతో త్వరితంగానే కాయలను తెంపి విక్రయిద్దామన్నా ప్రస్తుత ధరలు ప్రతికూలంగా మారాయి.

తగిన చర్యలుండాలి స్థానికంగా ధరలు తగ్గినపుడు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అనువుగా జిల్లాలోని మామిడి కొనుగోలు కేంద్రాల్లో దేశవ్యాప్త మామిడి మార్కెట్ల ధరలు తెలిసేలా ఆన్‌లైన్ తెరలను ఏర్పాటు చేయాలి. కాయల గ్రేడింగ్, ప్యాకింగ్ తదుపరి లారీలు, ట్రక్కులు, కిసాన్‌రైలు ద్వారా దిల్లీ కేంద్రంగా ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతిని పెంచటం ధరల్లో స్థిరత్వాన్ని తేనుంది. స్థానిక వ్యాపారులు ఒకేధరను చెప్పేందుకు వీలులేకుండా దూరప్రాంత వ్యాపారులను కొనుగోళ్లకు రప్పించాలి. అపెడ, ఉద్యానశాఖ, ఎఫ్‌పీవోలు, మహిళా సంఘాల ద్వారా మామిడిని కొనుగోలు చేసి మాల్స్, ఉప ఉత్పత్తుల తయారీ కంపెనీలకు తరలిస్తే అధిక ధరలు దక్కుతాయి. ఎలాంటి పండ్లయినా కాల్షియం కార్బైయిడ్‌తో మాగేయవద్దని సర్వోన్నత న్యాయస్థానం తీర్పును వెలువరించినా గత సీజన్లలో కొన్నిచోట్ల కార్బయిడ్ వాడకం గుట్టుగా సాగింది. మరోవైపు శాస్త్రీయత లేని చైనాపొడిని కూడా కొందరు వాడుతున్నారు. ప్రభుత్వం అనుమతించిన ఇథలిన్ గ్యాస్ లేదా రసాయనం ద్వారా కాయలను పండ్లుగా మార్చినపుడు వీటిని తిన్నవారి ఆరోగ్యాలు బాగుంటాయి. ఈ నేపథ్యంలో అపెడా, రైతులు, ఎఫ్‌పీవోలు, మహిళా సంఘాల ద్వారా సేకరించిన మామిడి కాయలను చల్‌గల్‌లోని రైపెనింగ్ ఛాంబర్‌లో మాగేసి నాణ్యమైన పండ్లను జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లోనూ విక్రయించే వీలుంది.

# 'జాతీయ ఉత్తమ ఆరోగ్య పంచాయతీ'గా గౌతంపూర్

కొత్తగూడెం : 'జాతీయ పంచాయతీ పురస్కారాలు–2021–22'లో జాతీయ స్థాయిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మెరిసింది. పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, బాలల హిత, నీటి సమృద్ధి, పరిశుభ్రత–పచ్చదనం, స్వయం సమృద్ధి, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళా హితం అనే తొమ్మిది అంశాలను ప్రాతిపదికగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం జాతీయ పురస్కారాలు ప్రకటిస్తున్న విషయం విధితమే. గత సంవత్సరానికి గాను 'ఆరోగ్యం' విభాగంలో ఇటీవల రాష్ట్రస్థాయి పురస్కారాన్ని దక్కించుకున్న చుంచుపల్లి మండలంలోని గౌతంపూర్ పంచాయతీ జాతీయ స్థాయిలోనే అగ్రస్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషం. వంద శాతం మార్కులు సాధించిన ఈ గ్రామం.. జాతీయ ఉత్తమ ఆరోగ్య పంచాయతీగా ఎంపికైంది. ఈ సమాచారాన్ని పురస్కా



రాల జాతీయ కమిటీ వెల్లడించినట్లు జిల్లా పంచాయతీ అధికారులు ధ్రువీకరించారు. త్వరలో నగదు పురస్కారంతో పాటు అవార్డు అందజేయనున్నట్లు చెప్పారు.

కలెక్టర్ అభినందన: గౌతంపూర్ పంచాయతీ పాలకవర్గం, అధికారులు సింగరేణి సౌజన్యంతో పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణ, శుద్ధి జలాల సరఫరా, మెరుగైన వైద్య సేవలకు కృషి చేస్తూ జాతీయ ఉత్తమ పురస్కారానికి ఎంపిక కావడం అభినందనీయమని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఇదే స్ఫూర్తితో అన్ని పంచాయతీల పాలకవర్గాలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. పురస్కారానికి ఎంపికైన సందర్భంగా సర్పంచి పొడియం సుజాత, కార్యదర్శి జక్కంపూడి షర్మిల, డీపీఓ రమాకాంత్, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, ఎంపీఓ సత్యనారాయణ, డీఎంహెచ్ఓ శిరీష, ఏఎన్ఎంలు విజయకుమారి, బి.తులసి, కౌసల్య, కాంతామణి, ఆశాకార్యకర్తలను ప్రత్యేకంగా అభినందించారు.

# విభాగినుల నిర్మాణంలో నాణ్యతేదీ?

జనగామ : జనగామలో ప్రమాదాల నివారణ, రద్దీ నియంత్రణే లక్ష్యంగా నిర్మించిన విభాగినుల ఉనికి ప్రశ్నార్థకమవుతోంది. రూ.కోట్ల వ్యయంతో పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఒక వైపు విభాగినుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరోవైపు ఇప్పటికే నిర్మించిన విభాగినులు నిర్వహణ లోపంతో, నాణ్యత లేమితో దెబ్బతింటున్నాయి. ప్రత్యేక నిధులతో..పట్టణ సుందరీకరణ, అభివృద్ధి పథకంలో భాగంగా తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ నుంచి రూ. 30 కోట్లు మంజూరయ్యాయి. గత శాసనసభ ఎన్నికల ముందు మంజూరైన పనుల్లో భాగంగా పట్టణంలోని నాలుగు ప్రధాన రహదారుల్లో రూ. 7.80 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు ప్రధాన రహదారుల్లో సుమారు 9.5 కి.మీ మేర ఆరు ప్యాకేజీలుగా పనులు జరగాలి. ఇందులో చౌరస్తా నుంచి నెహ్రూపార్కు, హనుమకొండ, సూర్యాపేట రహదారిలో పనులు పూర్తయ్యాయి. హైదరాబాద్ రోడ్డులో చౌరస్తా నుంచి హౌసింగ్ బోర్డు వరకు పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. అక్కడి నుంచి బైపాస్ వరకు పని మందకొడిగా సాగుతోంది. ఇదిలా ఉంటే..బయటపడుతున్న లోపాలు

ఏడాది, రెండేళ్ల క్రితం నిర్మాణం పూర్తయిన విభాగిని పనులు నాసిరకంగా ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. పనులు వివిధ దశల్లో ఉన్నప్పుడే వీటిపై పలు కథనాలు ప్రచురితమయ్యాయి. ప్రజారోగ్యశాఖ అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేశారు. మూడో



బృందం(థర్డ్‌పార్టీ) పత్తాలేని వైనాన్ని ఎండగట్టగా, మమ అన్నరీతిలో పరీక్షించారు. ప్రస్తుతం అనేక చోట్ల విభాగినులపై చేసిన సిమెంటు కప్పు కోపింగ్(రాతి కట్టడంపై ఇరువైపులా సిమెంటు స్లాబ్) కూలిపోతోంది. హనుమకొండ రోడ్డులో పారిశ్రామికవాడ క్రాస్ రోడ్డు వద్ద సీసీ కప్పు గోడల మీది నుంచి పైకి లేచింది. ప్రధాన రహదారుల్లో నిబంధనలకు విరుద్ధంగా పాదచారులు అడ్డదిడ్డంగా విభాగిని దాటేందుకు కొంత స్థలాన్ని వదిలారు. ఇలాంటి ఖాళీ స్థలాల వద్ద మట్టి జారిపోతోంది. రాళ్లు కదిలిపోతున్నాయి. బస్టాండు సమీపంలోనూ, ఓ చిన్నపిల్లల క్లినిక్ సమీపంలో నవజాత శిశువులను ఒడిలో పెట్టుకొని మహిళలు ప్రమాదకర స్థితిలో గోడలు, రోడ్డు దాటుతున్నారు. హనుమకొండ, సూర్యాపేట రోడ్డులోని విభాగిని కూడళ్ల వద్ద రాళ్లు కదిలి పగుళ్లు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల వాహనాలు తగలడంతో ఇలా జరిగిందంటున్నారు. మూల మలుపుల వద్దనే కాకుండా, మధ్యలోనూ రాళ్లు ఊడిపోయే స్థితిలో ఉన్నాయి. నిర్మాణ సమయంలో క్యూరింగ్ సరిగా లేకపోవడం, నాసిరకం సామగ్రి, నాణ్యత లేని రీతిలో పనులు జరగడం వల్లే, విభాగినుల ఉనికి ప్రశ్నార్థకమవుతోందంటున్నారు.

పరిశీలించి కౌన్సిల్‌కు నివేదిస్తా..

–డీఈ చంద్రమౌళి

విభాగినులను వాహనాలు ఢీకొనడం వల్ల అనేక చోట్ల దెబ్బతింటున్నట్లు మా దృష్టికి వచ్చింది. లోపాలను పరిశీలించి కౌన్సిల్‌కు నివేదిస్తా. పచ్చదనం పెంపులో లోపాలను సవరిస్తాం.

రూ.లక్షలు పోసికోనోకార్పస్ చెట్ల తొలగింపునకు సుమారు రూ. 5 లక్షలు ఖర్చయ్యాయి. వాటి స్థానంలో సూర్యాపేట, హనుమకొండ, సిద్ధిపేట రోడ్డులో వంతెనపైన మొక్కల ఏర్పాటుకు రూ. 15 లక్షలు వెచ్చించారు. హనుమకొండ రోడ్డులో బస్టాండు నుంచి ఎల్లమ్మ ఆలయం వరకు మొక్కలున్నట్లు లెక్కలున్నా, ఏసీపీ కార్యాలయం క్రాస్ వరకు మాత్రమే మొక్కలు నాటారు. మొక్కలకు రోజూ నీళ్లు పోస్తున్నా, అనేక చోట్ల నాటిన అలంకరణ మొక్కల చుట్టూ గడ్డి పెరిగింది. అసలు మొక్కలు కనిపించడం లేదు. అనేక చోట్ల విభాగిని గోడల నుంచి మట్టి కొట్టుకుపోతోంది.




# ఏపీలో దంచికొడుతున్న వానలు.. గోదావరి, మున్నేరులో వరద ఉధృతి

రాజమండ్రి: గోదావరి వరద ఉధృతి గంట గంటకు పెరుగుతోంది. ప్రస్తుతం భద్రాచలం దగ్గర రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ధవళేశ్వరం దగ్గర మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుత ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 10.02 లక్షల క్యూసెక్కులుగా ఉంది. అధికారులను ఎప్పటికప్పుడు విపత్తుల సంస్థ అప్రమత్తం చేస్తోంది. సహాయ చర్యల్లో మూడు ఎన్డీఆర్ఎఫ్, నాలుగు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉంచారు.

అత్యవసర సహాయం కోసం 24 గంటలు స్టేట్ కంట్రోల్ రూమ్‌లో నెంబర్లు అందుబాటులో ఉంచారు. గోదావరి పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల సంస్థ సూచించింది. ఇక తుంగభద్ర జలాశయం అప్పుడే సగం నిండింది. జలాశయంలోనికి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. ఇన్ ఫ్లో లక్ష 11 వేల 307 క్యూసెక్కులు కాగా.. అవుట్ ఫ్లో 60 వేల క్యూసెక్కులు ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1633.00 అడుగులుగా ఉంది. ప్రస్తుత నీటి మట్టం 1615.22 అడుగులు ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 105.788 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుత నీటి నిల్వ 50 టీఎంసీలుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇక ఎన్టీఆర్ జిల్లాలో మున్నేరు ప్రమాద స్థాయి మించి ప్రవహిస్తోంది. లక్ష పాతిక వేల క్యూసెక్కులకుపైగా వరద నీరు ప్రవహిస్తోంది. తెలంగాణ రాష్ట్రం వరంగల్, ఖమ్మం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు మున్నేరుకు వరద పోటెత్తింది. పెనుగంచిప్రోలు వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తోంది. చిల్లకల్లు-వైరా రహదారిలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వత్సవాయి మండలం లింగాల కాజ్ వేపై మున్నేరు పొంగిపొర్లుతుంది. వత్సవాయి మండలం పోలంపల్లి ఆనకట్ట దగ్గర వరద నీరు 16 అడుగులకు చేరింది. మున్నేరు పరివాహ ప్రాంతాల్లో అధికారులను జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు అప్రమత్తం చేశారు.

మరో రెండు రోజులపాటు ఇదే ప్రవాహం కొనసాగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

# 'ఇరిగేషన్ మంత్రి ఆంబోతులా అరుస్తాడు తప్ప ఏం చేయడు..?'



అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మరోసారి విరుచుకుపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులు పడకేశాయన్నారు. ఏపీలోని 69 నదులను అనుసంధానం చేయడం ముఖ్యమన్నారు. ఈ అనుసంధాన ప్రక్రియ పూర్తైతే.. నీటి సమస్యే ఉండదని తెలిపారు. ఉత్తరాంధ్రలో వంశధార, నాగావళి ప్రధాన నదులు.. వీటి కింద అనేక నదులు ఉన్నాయన్నారు. ఉత్తరాంధ్రలో నదులను అనుసంధానం చేసేలా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. వంశధార – గోదావరి నదులను అనుసంధానం చేయొచ్చు.. కానీ జగన్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. తాను ప్రెస్ మీట్ పెడుతున్నానని.. ప్రాజెక్టులపై సీఎస్ హడావుడి సమీక్ష పెట్టారని తెలిపారు. సీఎం జగన్, మంత్రి లేకుండానే ప్రాజెక్టులపై సమీక్షించారన్నారు. "ఇరిగేషన్ మంత్రి ఉన్నారు కానీ.. అంబోతులా అరుస్తాడు తప్ప ఏం చేయడు..?. కనకపు సింహాసనంపై శునకాన్ని కూర్చొపెట్టినట్టే ఉంది. ఈ ఏడాది చివర్లో ఏదో ఐదు ప్రాజెక్టులు ప్రారంభిస్తారట. ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా నిర్మాణం ఎలా పూర్తి చేస్తారు..?" అంటూ చంద్రబాబు నాయుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# లోకేశ్ పాదయాత్రే.. వైకాపాకి అంతిమయాత్ర: ప్రత్తిపాటి



వినుకొండ: పల్నాడులో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్రను అడ్డుకునేందుకు వైకాపా కుట్ర పన్నిందని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. పాదయాత్ర ప్రవేశించడానికి ముందే వైకాపా అలజడి సృష్టిస్తోందని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా పల్నాడులో యువగళం చరిత్ర సృష్టించబోతోందని తెలిపారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడివి నియంతృత్వ పోకడలని, తెదేపా శాంతియుతంగా ధర్నా చేస్తుంటే ఎమ్మెల్యే వెళ్లడమేంటని ప్రశ్నించారు. దురుద్దేశంతోనే తెదేపా శ్రేణుల వద్దకు వెళ్లి బొల్లా సవాల్ చేశారని ఆరోపించారు.


ఆయన తీరు చూస్తుంటే ప్రభుత్వమే కుట్ర పన్నుతున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. పల్నాడులో లోకేశ్ పాదయాత్ర.. వైకాపాకి అంతిమయాత్ర కానుందని ప్రత్తిపాటి ఘాటుగా వ్యాఖ్యానించారు. పల్నాడు జిల్లా వినుకొండలో ఇవాళ ఉదయం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెల కొన్న సంగతి తెలిసిందే. వైకాపా-తెదేపా వర్గాల పరస్పర సవాళ్లతో అక్కడి రాజకీయం వేడెక్కింది. తెదేపా కార్యకర్తలపై వైకాపా కార్యకర్తలు రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ క్రమంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఇరు పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో సీఐ గాల్లోకి కాల్పులు జరిపారు.

# వినుకొండ ఘటన రాక్షస పాలనకు నిదర్శనం



అమరావతి: వినుకొండలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ దాడి అప్రజాస్వామికం అని ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. "శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు.. ఏకపక్షంగా వ్యవహరించడం దుర్మార్గం . రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశమే లక్ష్యంగా వైసీపీ నాయకులు, శ్రేణులు నిత్యం దాడులు, హత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోంది.

పల్నాడు జిల్లా వినుకొండలో టీడీపీ కార్యకర్తలే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. దాడిలో 15మంది టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రోద్బలంతోనే ఈ దాడికి తెగబడ్డారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదన్న విషయాన్ని గమనించాలి. దాడులకు పాల్పడిన వైసీపీ కార్యకర్తలను వదిలేసి టీడీపీ కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం రాక్షస పాలనకు నిదర్శనం. టీడీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసేందుకే పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. శాంతిభద్రతలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైంది. తక్షణమే దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి పరిస్థితిని నియంత్రణలోకి తీసుకురావాలి." అని డిమాండ్ చేశారు.




అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు వివరాలతో తెదేపా ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించింది. 'వివేకానందరెడ్డికి న్యాయం.ఇన్' పేరుతో రూపొందించిన ఆ వెబ్‌సైట్‌లో ఆయన నేపథ్యం – వంశవృక్షం, హత్య అనంతర ఘటనల కాలక్రమం, పలుమార్లు మాట మార్చిన జగన్, కీలక వ్యక్తుల ప్రకటనలు అన్న నాలుగు ప్రధాన కేటగిరీలుగా సమాచారాన్ని పొందుపరిచారు.

కేసు పరిణామక్రమం, తక్షణ ఘటనలు, రాష్ట్ర ప్రభుత్వ విచారణ, సీబీఐ విచారణ, ఛార్జిషీట్లు అన్న విభాగాల కింద తేదీల వారీగా సమాచారాన్ని అందుబాటులో ఉంచారు. జగన్, అవినాష్ రెడ్డి, విజయసాయి రెడ్డి వంటివారు మాట్లాడిన వీడియోలను, వివేకా హత్య కేసుకు సంబంధించి పత్రికల్లో వచ్చిన వార్తలను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

వివేకా హత్య కేసు విచారణలో సీబీఐ ఏ ఛార్జిషీటు దాఖలు చేసినా.. వైకాపా ముఖ్యనాయకులు వక్రభాష్యం చెబుతూ, ప్రజల్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, అందుకే ఈ కేసు పూర్వాపరాల్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశంతోనే వెబ్‌సైట్ రూపొందించామని తెదేపా వర్గాలు తెలిపాయి. ఇందులో సమాచారాన్ని తెలుగు లేదా ఇంగ్లిష్‌లలో చదువుకునే సౌలభ్యం ఉంది.




జైపూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం రాజస్థాన్‌లో పర్యటించరు. అయితే, తమ రాష్ట్రానికి వచ్చే ప్రధానిని తాను కేవలం ట్విటర్ ద్వారానే ఆహ్వానించగలనని అంటున్నారు రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ . ప్రధాని కార్యక్రమంలో తన ప్రసంగాన్ని రద్దు చేయడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారట. ఈ విషయాన్ని గహ్లోత్ స్వయంగా ట్వీట్ చేయడం గమనార్హం. "ఈ రోజు మీరు రాజస్థాన్‌కు వస్తున్నారు. కానీ, ప్రధాని కార్యాలయం నా మూడు నిమిషాల ప్రసంగాన్ని షెడ్యూల్ నుంచి తొలగించింది. అందువల్ల, నేను నా ప్రసంగంతో మిమ్మల్ని ఆహ్వానించలేకపోతున్నా. అందుకే, ట్విటర్ వేదికగా మీకు సాదర స్వాగతం పలుకుతున్నా" అని గహ్లోత్ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ట్విటర్‌లోనే తమ డిమాండ్లను తెలియజేస్తున్నట్లు తెలిపారు. "నేను నా ప్రసంగంలో చెప్పాలనుకున్న డిమాండ్లను కూడా ట్విటర్ ద్వారానే మీ ముందుంచుతున్నా. ఆరు నెలల్లో ఏడోసారి రాష్ట్రానికి వస్తున్న మీరు.. ఈ సారైనా మా డిమాండ్లను నెరవేరుస్తారని ఆశిస్తున్నా" అంటూ గహ్లోత్ మోదీ సర్కారుకు కౌంటర్ ఇచ్చారు. రాజస్థాన్‌లోని సీకర్ పట్టణంలో ప్రధాని మోదీ గురువారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు/ప్రారంభోత్సవాలు చేయనున్నారు. 1.25లక్షల పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని ఆయన జాతికి అంకితం చేయనున్నారు. పర్యటనలో భాగంగా సీకర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాజస్థాన్‌లో ప్రధాని మోదీ పర్యటించడం గత ఆరు నెలల్లో ఇది ఏడోసారి కావడం గమనార్హం. ఇదిలా ఉండగా.. ఇటీవల మణిపుర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై ప్రధాని మోదీ స్పందిస్తూ రాజస్థాన్ ప్రస్తావన తీసుకురావడం తీవ్ర దుమారం రేపింది. దీనిపై గహ్లోత్ తీవ్రంగా స్పందించారు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రధాని కార్యక్రమంలో ఆయన ప్రసంగాన్ని తొలగించడం చర్చనీయాంశంగా మారింది.

**పీఎంవో స్పందన..** గహ్లోత్ ట్వీట్‌కు ప్రధాని కార్యాలయం స్పందించింది. "ప్రొటోకాల్ ప్రకారం.. ప్రధాని కార్యక్రమానికి మిమ్మల్ని ఆహ్వానించాం. మీ ప్రసంగానికి సమయాన్ని కూడా కేటాయించాం. కానీ, మీరు ఈ కార్యక్రమానికి రాలేరని మీ కార్యాలయం నుంచి సమాచారం వచ్చింది. నేటి కార్యక్రమానికి మిమ్మల్ని సాదరంగా స్వాగతిస్తున్నాం. అభివృద్ధి పనుల శిలాఫలకాలపైనా మీ పేరును ఉంచాం" అని పీఎంవో ట్విటర్‌లో పేర్కొంది.

# రణరంగంగా పల్నాడు జిల్లా...

## వినుకొండలో తీవ్ర ఉద్రిక్తత.. గాల్లోకి సీఐ కాల్పులు



వినుకొండ: పల్నాడు జిల్లా వినుకొండలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైకాపా-తెదేపా వర్గాల పరస్పర సవాళ్లతో అక్కడి రాజకీయం వేడెక్కింది. తెదేపా కార్యకర్తలపై వైకాపా కార్యకర్తలు రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ క్రమంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఇరు పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో సీఐ గాల్లోకి కాల్పులు జరిపారు. వివరాల్లోకి వెళితే.. తెదేపా సీనియర్ నేత, వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ తెదేపా కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్టాండ్ వద్దకు రాగానే వారికి వైకాపా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎదురుపడ్డారు. మట్టి తవ్వకాలపై చర్చకు సిద్ధమంటూ తన వాహనం దిగి మరీ తెదేపా నేతలకు ఆయన సవాల్ విసిరారు. గనుల అక్రమ తవ్వకాలు చేపట్టారంటూ బ్రహ్మనాయుడుకు వ్యతిరేకంగా తెదేపా కార్యకర్తలు నినాదాలు చేశారు. తెదేపా శ్రేణులను అడ్డుకున్న పోలీసులు.. అక్కడి నుంచి వెళ్లాలని వారికి హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో తెదేపా, వైకాపా కార్యకర్తల మధ్య రాళ్ల దాడి జరిగింది. దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పట్టణ సీఐ సాంబశివరావు గాల్లోకి కాల్పులు జరిపారు. పోలీసుల తెదేపా కార్యకర్తలపై లాఠీఛార్జ్ చేశారు. తమ నేతపై తప్పుడు కేసులు పెట్టారని.. దీన్ని నిరసిస్తూ శాంతియుతంగా ర్యాలీ చేపడితే అడ్డుకుంటారా? అని తెదేపా కార్యకర్తలు నిలదీస్తున్నారు. సమాచారం అందుకున్న జీవీ ఆంజనేయులు బస్టాండ్ వద్దకు చేరుకున్నారు.

# ఈ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది: ఖర్గే



దిల్లీ: ఈశాన్య రాష్ట్రం మణిపుర్ అంశంపై ప్రధాని మోదీ మాట్లాడకపోవడంపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మరోసారి మండిపడ్డారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రధాని తీరుపై విమర్శలు గుప్పించారు. "మణిపుర్ 85 రోజులుగా హింసతో మండిపోతోంది. పార్లమెంట్‌లో మణిపుర్ హింసపై ప్రధాని మోదీ మాట్లాడాలని కోరుతున్నా.. అందుకు ఆయన సుముఖత చూపడం లేదు. ప్రస్తుతం రాజస్థాన్‌లో రాజకీయ ప్రసంగాలు చేస్తున్నారు. ప్రజలకు ప్రస్తుత రాజకీయాలపై అవగాహన ఉంది. ఈ విధమైన రాజకీయాలపై వారు పోరాటం చేస్తారు. ఈ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. "అని దుయ్యబట్టారు. దేశ చరిత్రలో ఇలాంటి రోజును ఎన్నడూ చూడలేదని ఖర్గే అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరు మానవత్వానికి మచ్చగా మారుతోందని ఆరోపించారు. ఈ అంశంపై ప్రధాని పెదవి విప్పకపోవడం బాధాకరమన్నారు. మణిపుర్ ప్రజలు న్యాయం, గౌరవం, శాంతి పొందేందుకు అర్హులన్నారు. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన అమానుష ఘటన యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ అంశంపై ప్రధాని మోదీ వివరణ ఇవ్వాలని విపక్షాలు నిరసన తెలిపిన విషయం తెలిసిందే.

# బిగ్ బాస్ షో.. టీవీ ప్రసారాలకు సెన్సార్ లేకపోతే ఎలా?: ఏపీ హైకోర్టు




అమరావతి: టీవీల్లో అసభ్య, అభ్యతురకర రీతిలో రియాల్టీ షోలు, ఇతర కార్యక్రమాల ప్రసారానికి ముందు సెన్సార్ చేయకుపోతే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై లోతుగా విచారణ జరుపుతామని, కేంద్రానికి తగిన సచనలు చేసే విషయాన్ని పరిశీలిస్తామని తెలిపింది. టీవీ కార్యక్రమాల పర్యవేక్షణకు ఓ యంత్రాంగం లేకపోవడం సరికాదని వ్యాఖ్యానించింది. యుముతను పెడుదోవ పట్టిస్తున్న బిగ్‌బాస్ షో నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుత సామాజిక కార్యకర్త, నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి దాఖలు చేసిన పిల్‌పై జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ కేసులో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖులు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్, స్టార్ వ టీవీ ప్రైవేట్ లిమిటెడ్, ఎండేమోల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, బిగ్‌బాస్ షో వ్యాఖ్యాత అక్కినేని నాగార్జునకు నోటీసులు జారీ చేసింది. స్టార్ మా టీవీ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి, బిగ్‌బాస్ షోను అభివృద్ధి చేసిన ఎండేమోల్ ఇండియా లిమిటెడ్ తరఫున సీనియర్ న్యాయవాది చిత్తరవు రఘు, పిటిషనర్ తరఫున గుండాల శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపించారు.

# శ్రీవారి భక్తులకు శుభవార్త.. ఇకపై తిరుమలలో వసతికి ఇబ్బందపడకుండా....



తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనం కోసం అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. సెలవుల రోజుల్లో, పండగ సమయాల్లో భక్తుల సంఖ్య మరింత పెరుగుతుంది. దీంతో అక్కడ వసతి సమస్య ఏర్పడుతూ ఉంటుంది. ఈ వసతి సమస్యను తీర్చేందుకు టీటీడీ ప్రయోగాత్మక నిర్ణయం తీసుకుంది. తిరుమలలో మొబైల్ ప్రయోగాత్మకంగా కంటైనర్స్‌ను టీటీడీ ప్రవేశపెట్టింది. గురువారం టీటీడీ ట్రాన్స్‌పోర్ట్ డిపోలో మొబైల్ కంటైనర్‌ను టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం ఇకపై మొబైల్ కంటైనర్స్ టీటీడీ తీసుకురానుంది. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. రద్దీ సమయంలో తిరుమలకు వచ్చే భక్తులకు వసతి విషయంలో కొంచెం అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. తిరుమలలో వసతి గదులు నిర్మించేందుకు వీలులేదని.. మొబైల్ కంటైనర్స్ ద్వారా కొంత మంది భక్తులకు వసతి కల్పించే విధంగా యోచిస్తున్నట్లు చెప్పారు. వసతి సదుపాయం దొరకని భక్తులకు.. మొబైల్ కంటైనర్స్‌లో బస చేసే విధంగా రూపొందించామన్నారు. తొమ్మిది లక్షల రూపాయలు విలువ చేసే మొబైల్ కంటైనర్‌ను విశాఖపట్నంకు చేందిన మూర్తి విరాళంగా ఇచ్చారని తెలిపారు. మొబైల్ కంటైనర్‌లో 12 మంది బస చేసే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ట్రయల్ క్రింద మొబైల్ కంటైనర్స్‌ను ఏర్పాటు చేసామని.. భక్తులకు ఎక్కువ లాభదాయకంగా ఉంటే భవిష్యత్తులో మరికొన్ని మొబైల్ కంటైనర్స్‌ను ఏర్పాటు చేస్తామని వైవీ సుబ్బారెడ్డి వెల్లడించారు.

# అనుపమ అలా ఫిక్స్ అయ్యిందా..?

అఆ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన మలయాళ భామ అనుపమ పరమేశ్వరన్ ఆ తర్వాత ప్రేమం సినిమా రీమేక్ లో కూడా నటించి మెప్పించింది. మొదట్లో హెూంలీ లుక్స్ తో ఆడియన్స్ ని అలరించిన అనుపమ సడెన్ గా తనని తాను పూర్తిగా మార్చేసుకుంది. అ ఆ, శతమానం భవతి సినిమాల్లో ముద్దుగా బొద్దుగా కనిపించిన అనుపమ ఆ టైం లో గ్లామర్ షోకి కూడా దూరంగా ఉంటూ వచ్చింది. ఇక్కడ కొన్నాళ్లు రాణించాలంటే ఇలా ఉంటే సరిపోదని అనుకున్న అమ్మడు డైటింగ్ గట్రా చేసి స్లిమ్ గా మారింది. లుక్ మార్చడమే కాదు తన స్టైల్ కూడా మార్చి గ్లామర్ షోకి రెడీ అయ్యింది అనుపమ. కెరీర్ మొదట్లో స్కిన్ షోకి నో చెప్పిన అమ్మడు ఇప్పుడు గ్లామర్ పాత్రలకు కూడా ఓకే అనేస్తుంది. అనుపమలో వచ్చిన ఈ మార్పు ఆమె ఫ్యాన్స్ ని విశేషంగా ఆకట్టుకుంటుంది. అనుపమ పరమేశ్వరన్ లేటెస్ట్ గా డిజే టిల్లు సీక్వల్ గా వస్తున్న టిల్లు స్క్వేర్ సినిమాలో నటిస్తుంది. సినిమా సాంగ్ ప్రోమో ఒకటి రిలీజైంది. ఈ



టీజర్ చూసిన ఆడియన్స్ అనుపమ గ్లామర్ షో చూసి ఎంజాయ్ చేస్తున్నారు. మడి కట్టుకుని కూర్చుంటే ఇక్కడ పని అవ్వదని త్వరగానే తెలుసుకున్న అనుపమ గ్లామర్ గేట్లు ఎత్తేసిందని చెప్పొచ్చు. అందుకే ఈమధ్య అమ్మడు చేస్తున్న సినిమాల్లో గ్లామర్ షోకి సై అనేస్తుంది. లాస్ట్ ఇయర్ వచ్చిన రౌడీ బాయ్స్, కార్తికేయ 2 సినిమాల్లో కూడా తన ట్రెండీ లుక్స్ తో అలరించింది అనుపమ. ఇక టిల్లు స్క్వేర్ కోసం మరో అడుగు ముందుకేసి స్కిన్ షోతో అదరగొట్టేస్తుంది. ఉన్న కొన్నాళ్లైనా సరే ఆడియన్స్ ని తమ అందాలతో ఉక్కిరి బిక్కిరి చేయాలని ఫిక్స్ అయ్యినట్టు ఉంది అనుపమ అందుకే అమ్మడు ఈమధ్య సినిమాలు ఫోటో షూట్స్ ఎక్కడ చూసినా సరే ఆడియన్స్ టార్గెట్ గా అమ్మడి అందాల ప్రదర్శన అదరగొట్టేస్తుంది. డీజే టిల్లులో నేహా శెట్టి తన హాట్ లుక్స్ తో ఆడియన్స్ ని మెప్పించగా టిల్లు స్క్వేర్ సినిమాలో అనుపమ హాట్ అప్పీల్ తో సినిమాను నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్తుంది. ఈ సినిమా తో పాటుగా అనుపమ రవితేజ ఈగల్ సినిమాలో కూడా నటిస్తుంది. ఈ రెండు సినిమాలతో అనుపమ మరోసారి టాలీవుడ్ లో హడావిడి చేస్తుంది. టిల్లు స్క్వేర్ మాత్రం అమ్మడికి మంచి మైలేజ్ ఏర్పడేలా చేస్తుందని చెప్పొచ్చు.

# అడ్వెంచర్ థ్రిల్లర్ లో కేరళ స్టోరీ బ్యూటీ

'ది కేరళ స్టోరీ' సక్సెస్ తో ఆదాశర్మ పాన్ ఇండియాలో పాపులర్ అయిన సంగతి తెలిసిందే. అంతకు ముందు వరకూ ఆదా శర్మ వేరు.. ఆ తర్వాత వేరు అని నిరూపించిన చిత్రమిది. వైవిధ్యమైన పాత్రతో తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చిన రోల్ అది. ఆ పాత్ర కోసం ఆమె సన్నధమైన విధానం ప్రతీది ఆదాశర్మని ప్రత్యేకంగా ప్రొజెక్ట్ చేసింది. దీంతో సోషల్ మీడియాలో ట్రెండింగ్ స్టార్ గా మారింది. ఇది ఆదాశర్మ కెరీర్ కి ఓ రకమైన బూస్టింగ్ లా పనికొచ్చింది. తాజాగా ఈ బ్యూటీ కమాండోగా మరోసారి మెప్పించడానికి రెడీ అవుతోంది. విద్యుత్ జమాల్ ప్రధాన పాత్రలో నటించిన 'కమాండో' సిరీస్ ఎంత పెద్ద సక్సెస్ సాధించిందో తెలిసిందే. ఇన్ స్పెక్టర్ భావన రెడ్డి పాత్రలో ఆదాశర్మ ఆద్యంతం అలరించింది.



తాజాగా ఈ యాక్షన్ థ్రిల్లర్ నుంచి మరో కమాండో రాబోతుంది. ఈసిరీస్ నుంచి ప్రేమ్ పర్రిజా అనే కొత్త నటుడు పరిచయమవుతున్నాడు. ఇందులో ఆదాశర్మ మరోసారి కీలక పాత్రలో నటించబోతుంది. ఇంకా సినిమాలో వైభవ్ తత్వవాడి.. ఇష్టియాఖాన్.. శ్రేయా చౌదరి..అమిత్ శియాల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని కేరళ స్టోరీ నిర్మాత విపుల్ అమృత్ లాల్ నిర్మిస్తున్నారు. ఈ సన్నివేశాన్ని గుర్తు చేసుకుని ఆదాశర్మ ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ చేసింది. 'కమాండో ప్రాంచైజీలోకి వస్తోన్న ప్రేమ్ కి స్వాగతం. కొత్త కమాండోతో..యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్ రానుందని రాసుకొచ్చింది. చివరిగా విడుదల తేదిని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో ఈ సినిమా రిలీజ్ కానుంది. అయితే ఈ సినిమా ఎప్పుడు ప్రారంభం అవుతుంది? ఎప్పుడు పూర్తి చేస్తారు? దర్శకుడు వివరాలు వంటివి గోప్యంగా ఉంచారు. ఈ చిత్రాన్ని నిర్మించేది కేరళ స్టోరీ నిర్మాత కావడంతో హిందీతో పాటు మలయాళంలోనూ తెరకెక్కిస్తారా? అన్నది తెలియాల్సి ఉంది.





# టూ పీస్ లో రకుల్ అందాల దాడి!



రకుల్ ప్రీత్ సింగ్ హాటెస్ట్ సెన్సేషన్ గురించి చెప్పాల్సిన పనిలేదు. సెగలు పుట్టించే అందాలతో కుర్రాళ్లకు నిదుర లేకుండా చేస్తుంది. అమ్మడు వెకేషన్ కి వెళ్లిందంటే? బికినీ ట్రీట్ తప్పనిసరి. వైవిధ్యమైన భంగిమల్లో కెమోరా ఫోజులు నెట్టింట కాక పుట్టిస్తాయి. తాజాగా అమ్మడు దుబాయ్ వెకేషన్ లో ఉంది. స్టార్ హెూటల్ బస చేసిన బ్యూటీ...ప్రయివేట్ బీచ్ లో అందాల దాడితో మళ్లీ తెగబడింది. టూపీస్ బికినీలో మంటలు పుట్టించే బాధ్యత తీసుకుంది. లేలేత చిల కాకు పచ్చ పీసుల్లో రకుల్ సెగలు పుట్టించే భంగిమలతో ఆకట్టుకుంటుంది. నియాన్ షర్ట్‌తో గ్లామ్‌ను కవర్ చేసింది. బీచ్ లో ఎగ్జోటిక్ లొకేషన్లలో అందాలన్ని ధారళంగా ఆరబోసింది. అమ్మడు స్కిన్ టోన్ తళతళలాడిపోతుంది. రకుల్ స్పైసీ ట్రీట్ కి కుర్రాళ్లంతా ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అమ్మడి అందాలపై కామెంట్లు అంతే ఆసక్తికరం. ఇలాంటి బికినీ భంగిమలు రకుల్ కి కొత్తేం కాదు. రకుల్ ఎప్పుడు వెకేషన్ కి వెళ్లినా టూపీస్..స్విమ్ షూట్ లోకి దూరిపోతుంది. వాటిని ఇన్ స్టాలో షేర్ చేసి కుర్రాళ్ల అటెన్షన్ డ్రా చేస్తుంది. ఆ ఫోటోలపై వచ్చే కామెంట్లను అంతే ఆస్వాదిస్తుంది. వర్క్ ఫ్రంట్‌లో రకుల్ బాలీవుడ్‌లో రెండు సినిమాలు చేస్తోంది. అలాగే అమ్మడు శివ కార్తికేయన్ కి జంటగా ఓ సూపర్ హీరో చిత్రంలోనూ నటిస్తోంది. మరోవైపు విశ్వనటుడు కమల్ హాసన్ తోనూ తెరను పంచకుం టోంది. ఆయనకు జోడీగా 'ఇండియాన్-2'లో నటిస్తోంది. సోగసరికి మళ్లీ టాలీవుడ్ లో అవకాశాలు వస్తున్నాయని ప్రచారం సాగుతోంది. అయితే అమ్మడి ఫోకస్ అంతా హిందీ సినిమాలపైనే ఉంది. మరోవైపు ప్రియుడు జాకీ భగ్నానీతో పీకల్లోతు ప్రేమలోనూ మునిగి తేలుతోన్న సంగతి తెలిసిందే.

# బాక్సాఫీస్ హిట్.. ఈ బ్యూటీలకు చాలా అవసరం 'బ్రో'





పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, మెగా మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ కలిసి చేస్తున్న సినిమా బ్రో. తొలిసారి మామ, అల్లుళు కలిసి నటిస్తుండటంతో, ఈ మూవీపై ఎక్కువ అంచనాలు ఉన్నాయి. ముందు నుంచి ఈ మూవీ పై హైప్ పెంచుతూ వస్తున్నారు. ముఖ్యంగా పవన్ ని వింటేజ్ లుక్ లో చూపించడం అందరికీ నచ్చుతోంది. ఇటీవల ట్రైలర్ విడుదల చేయగా, విపరీతంగా నచ్చేసింది. కేవలం పవన్ కోసమే ఈ మూవీచూసేవాళ్లు ఉన్నారు. అయితే, ఈ మూవీపై ఎక్కువ ఆశలు పెట్టుకుంది మాత్రం హీరోయిన్లే. ఈ మూవీలో ఇద్దరు హీరోయిన్లు నటిస్తున్నారు. ఒకరు కేతిక శర్మ కాగా, మరొకరు ప్రియా వారియర్. ఇప్పుడు బ్రో మూవీ హిట్ అవ్వడం పవన్, తేజ్ కి అంతగా అవసరం కాకపోయినా.. కానీ, వీరికి మాత్రం చాలా అవసరం. ఎందుకంటే, ఈ ఇద్దరు బ్యూటీలకు ఇప్పటి వరకు మంచి హిట్ పడింది లేదు. కేతిక కి తెలుగులో ఇది నాలుగో చిత్రం. ముందు చేసిన మూడు సినిమాలు బాక్సాఫీసు వద్ద బోల్తా పడ్డాయి. రొమాంటిక్, లక్ష్య, రంగ రంగ వైభవంగా, ఈ మూడు చిత్రాల్లో కేతిక అందంగా కనిపించినా, మంచి నటన కనపరిచినా, ఆమెను అదృష్టం వరించలేదు. ఫలితంగా, ఆమె ఆశలన్నీ బ్రో మూవీ మీదే పెట్టుకుంది. బ్రో మూవీ క్లిక్ అయితేనే కేతికకు మళ్లీ ఛాన్సులు వచ్చే అవకాశం ఉంది. ఇక ప్రియా వారియర్ ది కూడా ఇంచు మించు అదే పరిస్థితి. తెలుగులో నితిన్ చెక్ మూవీలో, అదేవిధంగా, తేజ సజ్జ సరసన ఇష్క్ అనే మూవీల్లో నటించింది. ఈ రెండూ కూడా క్లిక్ కాలేకపోయాయి. ఈ రెండు సినిమాల తర్వాత ఆమెకు తెలుగులో అవకాశం రావడానికి కూడా చాలా కాలం పట్టింది. ఇప్పుడు ఈ బ్రో మూవీలో నటిస్తోంది. అందుకే, మళ్లీ ఆమె తెలుగులో క్లిక్ అవ్వాలి అంటే, ఈ బ్రో కచ్చితంగా బ్లాక్ బస్టర్ కావాల్సిందే. ఇక, ఈ మూవీ క్లిక్ కావాలంటే పవన్ మ్యాజిక్ చేయాల్సిందే. పవన్ చేతిలోనే ఇద్దరు ముద్దుగుమ్మల భవిష్యత్తు ఆధారపడి ఉంది అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇక, ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.

# బ్రో అనాల్సిన బ్యూటీ సామజవరగమన అయింది!

'సామజవరగమన' సినిమాతో టాలీవుడ్ కి పరిచయమైంది బెంగళూరు బ్యూటీ రెబా మోనికా జాన్. తొలి సినిమాతోనే అమ్మడు మంచి విజయం ఖాతాలో వేసుకుంది. అందం..అభినయం అమ్మడికి అదనపు అస్సెట్ గా కలిసోచ్చాయి. నటిగానూ ప్రూవ్ చేసుకుంది. దీంతో అమ్మడు యంగ్ హీరోలకు పర్ఫెక్ట్ ఛాయిస్ గానూ కనిపిస్తోంది. అయితే రెబాకి ఈఛాన్స్ అనుకోకుండా దక్కినట్లు తెలుస్తోంది. ఆమె హైదరాబాద్ కి వేరే సినిమా కోసం వచ్చింది. కానీ ఆ సినిమా మిస్ అయినా సామజవరగమనలో ఛాన్స్ అందుకుని అనుకోంకుండా వెలుగులోకి వచ్చేసింది. ఆ కథేంటే ఆమె మాటల్లోనే.. 'పవన్



కళ్యాణ్..సాయితేజ్ 'బ్రో' సినిమా కోసం నన్ను పిలిపించారు. అప్పుడే నిర్మాత రాకేష్ దండా ఆఫీస్ కి వెళ్లడం అక్కడ రామ్ అబ్బరాజ్ నన్ను చూసి కథ చెప్పారు. నేను ఒకే చేయడం అన్నీ చకచకా జరిగిపోయాయి. శ్రీవిష్ణు అంతకు ముందు ఓ సినిమా కోసం నన్ను సంప్రదించారుట. కానీ నేను తెలుగులో నటించడం లేదని ఎవరో చెప్పడంతో ఆగిపోయారుట. కానీ చివరికి విధి ఈ సినిమాలో అవకాశం కల్పించేలా చేసింది. ఏదో ఒక రోజు పీకే..తేజ్ లతోనూ కలిసి నటిస్తాను..ఆ ఛాన్స్ నాకు వస్తుంది అన్న నమ్మకం ఉంది' అని అన్నారు. అయితే బ్రో కోసం పిలపించి రెబాకి ఎందుకు ఎంపిక చేయలేదు అన్న విషయం మాత్రం రివీల్ చేయలేదు. లుక్ టెస్ట్ లో ఫెయిల్ అవ్వడంతోనే బ్రోలో ఛాన్స్ ఇచ్చి ఉండరు. బ్రో లో హీరోయిన్లగా ప్రియా వారియర్...కేతికశర్మని తీసుకున్నారు. ఈసినిమాకి దర్శకుడు సముద్రఖని అయినా వెనుకండి అంతా నడిపించింది త్రివిక్రమ్. ఇందులో హీరోల నుంచి హీరోయిన్ల ఎంపిక వరకూ ప్రతీ విషయం గురూజీ దగ్గరుండి చూసుకున్నారు. అలాగే రెబా మోనికాకి త్రివిక్రమ్ అవకాశం ఇవ్వకుండా ఉండరు. తను చేసే ఏదో సినిమాలో ఏదో ఒక రోజు అవకాశం కల్పిస్తారు. నిత్యామీనన్ కి మాటిచ్చినట్లే బెంగుళూరు వచ్చిన బ్యూటీకి గురూజీ ఛాన్స్ ఇచ్చి మాట నిలబెట్టుకుంటారు.

# బాలీవుడ్ చీప్ ట్రిక్స్.. ఇలానే కొనసాగిస్తే పతనమే!

తమ సినిమాను చూసేలా ఆడియెన్స్?ను థియేటర్‌కు రప్పించడం కోసం ఆయా చిత్రబృందాలు ఎన్నెన్నో వ్యూహాలు రచిస్తుంటాయి. అవన్నీ ప్రమోషన్స్?లో స్పష్టంగా కనిపిస్తూనే ఉంటాయి. ప్రచార చిత్రాల విడుదలలు, ఈవెంట్లు, టూర్లు, కాంటెస్టులు... ఇలా బోలెడంత హంగామా చేస్తుంటాయి మూవీటీమ్స్?. మా చిత్రంలో కొత్త కథ ఉందని చెప్పడంతో మొదలుకొని.. అవసరమైతే రిలీజ్? తర్వాత అదనంగా మరి కొన్ని సీన్స్?, సాంగ్స్?ను కలపడం వరకు ప్రతిదీ.. ప్రేక్షకుల్ని ఆకర్షించడం కోసమే. అయితే ప్రేక్షకుల్ని ఆకర్షించేందుకు.. బాలీవుడ్ ఈ మధ్య కొత్త దందా మొదలుపెట్టింది. తమ సినిమా థియేటర్?లో చూసేందుకు, అదనంగా మరికొన్ని టికెట్లు తెగడం కోసం ఓ కొత్త పంథాను ప్రారంభించింది. అదేంటంటే.. గతంలో ఎప్పుడూ లేని రీతిలో.. సినిమాను ప్రమోట్ చేసేందుకు ఆ చిత్రాల టికెట్లను భారీ స్థాయిలో మరొకరు కొనుగోలు చేయడం, ఫ్రీగా టికెట్లను పంచడం, ఒకటి కొంటే ఇంకొకటి ఇవ్వడం, టికెట్ల రేట్లలో రాయితీలు ఇవ్వడం కాస్త ఎక్కువగానే చేస్తున్నారు. మరో మూడు రోజుల్లో రణ్‌వీర్-ఆలియా రాకీ ఔర్ రాణి కీ ప్రేమ కహాని చిత్రం రిలీజ్ కానుంది. అయితే ఈ సినిమా కోసం 50 వేల టికెట్లను.. ప్రముఖ సంస్థలైన కజారియా, పెప్సీ బ్రాండ్లు కొనుగోలు చేశాయి. వీకెండ్?లో ఈ టికెట్లను ఫ్రీగా పంచుతున్నట్లు తెలుపుతూ తమ కస్టమర్లను ఆకర్షిస్తున్నాయి. అలాగే



స్టూడెంట్స్ కోసం ఫ్రీగా టికెట్లను పంచనుంది మూవీటీమ్. అంతకుముందు ప్రభాస్ ఆదిపురుష్ సినిమా విషయంలోనూ ఇలానే జరిగింది. వేల కొద్ది టికెట్లను బయట సంస్థలు కొనుగోలు చేసి సినిమాను ప్రమోట్ చేశాయి. కార్తిక్ ఆర్యన్? షెహజాదా సినిమాకైతే ఒకటి కొంటే ఇంకోటి ఫ్రీ అనే ఆఫర్?ను ప్రకటించాయి. కానీ ఈ చిత్రాలు ఇన్ని బంఫర్ ఆఫర్స్ ప్రకటించినా ప్రేక్షకుడ్ని ఆకట్టుకోలేకపోయాయి. బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్?గా నిలిచాయి. అదే సమయంలో గతవారం ఇక్కడ రిలీజైన హాలీవుడ్? సినిమాలు ఓపెన్‌హెయిమర్, బార్బీ చిత్రాలు భారీ స్థాయిలో వసూళ్లను అందుకున్నాయి. పైగా వీటి టికెట్ ధరలు కూడా వేలల్లోనే ఉన్నాయి. అయినా ఆడియెన్స్ ఈ సినిమాను చూసేందుకు ఆసక్తి చూపారు. అంతకముందు షారుక్ పఠాన్ కోసం ఎలాంటి ఆఫర్లను ప్రకటించలేదు. అయినా ఆ చిత్రం ఏకంగా రూ.1000 కోట్లు కొల్లగొట్టింది. అంటే ఇక్కడ అంతిమంగా అర్థమవుతున్న విషయం ఏంటంటే.. సినిమాలో కంటెంట్ ఎక్సైటింగ్ ఉంటే.. ఎలాంటి ఆఫర్స్?తో సంబంధం లేకుండానే ఆటోమెటిక్?గా సినిమా చూసేందుకు ప్రేక్షకుడు థియేటర్?కు వస్తాడు. కాబట్టి టికెట్స్?పై ఆఫర్‌ను ప్రకటించడం, ఫ్రీగా పంచడం, అనవసరమైన ఎక్సైటింగ్ చీప్ ట్రిక్స్? ఆఫర్స్?ను ప్రకటించి బాలీవుడ్.. తనంత తానే బాక్సాఫీస్? ఎకానమిక్?ను(ఆర్థిక వ్యవస్థ) నాశనం చేసుకుంటుందని సినీ విశ్లేషకులు అంటున్నారు. ఇది ఇలానే కొనసాగితే బాలీవుడ్ ఇండస్ట్రీ ఎకనామీ దారుణంగా పడిపోతుందని, కుదేలవుతుందని అభిప్రాయపడుతున్నారు.




హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు పరిస్థితిని ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పూర్తిగా నీట మునిగిన మోరంచపల్లి గ్రామంలో.. సహాయక చర్యల కోసం హెలికాప్టర్‌ను తరలించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి ఆదేశించారు. సహాయక చర్యల్లో సాధారణ హెలికాప్టర్ల సేవలు వినియోగించుకోవడం కష్టమయ్యే అవకాశం ఉన్నందున ఇండియన్ ఆర్మీతో ప్రభుత్వం సంప్రదింపులు జరిపింది. ఈ మేరకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అధికారులతో సీఎస్ శాంతికుమారి చర్చించారు. అనంతరం ముంపునకు గురైన మోరంచపల్లి గ్రామానికి రెండు సైనిక హెలికాప్టర్లను పంపుతున్నట్లు సీఎస్ శాంతికుమారి తెలిపారు. ఇప్పటికే మోరంచపల్లికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను తరలించారు. ఎప్పటికప్పుడు సీఎస్.. జిల్లా అధికారులతో సంప్రదిస్తూ పరిస్థితిని సీఎం కేసీఆర్‌కు నివేదిస్తున్నారు. మరోవైపు, ఇతర వరద ముంపు ప్రాంతాల్లో కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు.

**వరద బాధిత జిల్లాలకు ప్రత్యేక అధికారులు :** మరోవైపు, భారీ వర్షాల నేపథ్యంలో వరద బాధిత జిల్లాలకు ప్రత్యేక అధికారుల (ఐఏఎస్‌ల)ను సీఎస్ శాంతికుమారి నియమించారు.

ములుగు జిల్లా ప్రత్యేక అధికారిగా కృష్ణ ఆదిత్య, భూపాలపల్లికి పి.గౌతమ్, నిర్మల్‌కు ముషారఫ్ అలీ, మంచిర్యాలకు భారతి హోలికేరి, పెద్దపల్లి జిల్లాకు సంగీత సత్యనారాయణ, ఆసిఫాబాద్ జిల్లాకు హన్మంతరావును ప్రత్యేక అధికారిగా ఖరారు చేశారు.




భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి గ్రామం జల దిగ్బంధంలో ఉండిపోయింది. మోరంచ వాగు ఉప్పొంగడంతో సమీపంలోని ఇళ్లలోకి 4 నుంచి 5 అడుగుల మేర నీరు చేరింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురై ఇంటి స్లాబ్‌ల పైకి ఎక్కారు. కొంతమంది నిత్యావసర వస్తువులు కూడా తీసుకెళ్లి స్లాబ్‌లపై కూర్చున్నారు. మరికొంతమంది సమీపంలోని చెట్లపైన తలదాచుకున్నారు. పరిస్థితి తీవ్రత నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అప్రమత్తం చేశారు.

పోలీసులు, ఇతర అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని ప్రజలను సురక్షిత ప్రదేశానికి చేర్చేందుకు చర్యలు చేపట్టారు.




తెలంగాణలో వద్దంటే వర్షాలు కురుస్తున్నాయి. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వానలు దంచికొడుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ఈ భారీ వర్షాల నేపథ్యంలో కేసీఆర్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు శుక్రవారం కూడా సెలవు ప్రకటించింది. గురువారం మధ్యాహ్నం విద్యాశాఖ ఉన్నతాధికారులు, మంత్రి సబితా ఇంద్రారెడ్డితో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. మరో రెండ్రోజులు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే శనివారం మొహర్రం, ఆ తర్వాత ఆదివారం ఇలా విద్యా సంస్థలకు వరుసగా సెలవులు వచ్చాయి. కాగా.. ఇప్పటికే బుధ, గురువారాలు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సెలవులు మరో రోజు పొడిగించడం జరిగింది.

దీంతో బుధవారం, గురువారం, శుక్రవారం, శనివారం ఆ తర్వాత ఆదివారం ఇలా వరుస గా నాలుగు రోజులు సెలవులు వచ్చినట్లయ్యింది. ప్రభుత్వం తీసుకున్న ఈ కీలక నిర్ణయంతో విద్యార్థులు, తల్లిదండ్రులు కాస్త ఊపిరిపీ ల్చుకున్నట్లయ్యింది. ఇదిలా ఉంటే.. మరో మూడ్రోజుల పాటు భారీగా నే వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు.. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉండటంతో రెడ్ అలర్ట్ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ముందు చూపుతోనే ముప్పు తప్పింది : మంత్రి తలసాని

హైదరాబాద్ : భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ నగరంలో ప్రజలు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సేవలు అందిస్తున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం మంత్రి తలసాని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి లతో కలిసి GHMC కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ ను సందర్శించారు. కంట్రోల్ రూమ్ కు వస్తున్న ఫిర్యాదులు, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఆరా తీశారు. మూడు షిఫ్టులలో వివిధ శాఖల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు మంత్రికి వివరించారు. వాతావరణ శాఖ అందించే సమాచారం మేరకు GHMC పరిధిలోని అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి GHMC కమిషనర్ రోనాల్డ్ రోస్, SNDP ENC జియా ఉద్దిన్ లతో కలిసి మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దూరదృష్టితోనే నగరంలోని అనేక ప్రాంతాలలో వరద ముంపు సమస్య తొలగిపోయిందని పేర్కొన్నారు. నగరంలోని నాలాల సమగ్ర అభివృద్ధి కోసం చేపట్టిన %వాచీణ్రా% కార్యక్రమం క్రింద 36 నాలాల అభివృద్ధి పనులు చేపట్టగా, 30 పనులు పూర్తయ్యాయని, మిగిలిన 6 పనులు వేగంగా సాగుతున్నాయని వివరించారు. గత సంవత్సరం వరకు బేగంపేట నాలాకు ఎగువ నుండి వచ్చే వరదనీటి వలన నాలా వెంట ఉన్న బ్రాహ్మణ వాడి, శ్యాం లాల్ బిల్డింగ్ తదితర కాలనీలు వరదనీటితో మునిగిపోయి ప్రజలు అనేక అవస్థలు పడేవారని పేర్కొన్నారు. %వాచీణ్రా% కార్యక్రమం క్రింద బేగంపేట నాలా అభివృద్ధి పనులు చేపట్టిన ఫలితంగా ఈ సంవత్సరం అలాంటి పరిస్థితులు ఏర్పడలేదని చెప్పారు. ప్రారంభంలో SNDP కార్యక్రమంపై పలు విమర్శలు వచ్చాయని, కానీ వాటి ఫలితాలు నేడు కండ్ల ముందు కనిపిస్తున్నాయని





అన్నారు. అదేవిధంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్ మెంట్స్ విభాగం దేశంలో ఎక్కడా లేదని, ఆ శాఖ ద్వారా కూడా ప్రజలకు వివిధ అత్యవసర సేవలు అందించాబడుతున్నాయని అన్నారు. GHMC కంట్రోల్ రూమ్ కు వచ్చే పిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ క్షేత్రస్థాయి లోని సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్న అధికారులు, సిబ్బందిని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ప్రజలు అత్యవసర సేవలకు GHMC కంట్రోల్ రూమ్ (040-21111111, 9000113667) కు కాల్ చేయాలని కోరారు.

హుస్సేన్ సాగర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ లలో ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో పై ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను కూడా అప్రమత్తం చేస్తున్నట్లు వివరించారు. మరో 2, 3 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ ప్రకటించిందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని మంత్రి తెలిపారు.

## కల్వకుంట్ల కుటుంబం మాటలు తీయగా ఉంటాయి.. కానీ

హైదరాబాద్: సీఎం కేసీఆర్ కుటుంబంపై కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కల్వకుంట్ల కుటుంబం ప్రజల గొంతులు కోసే కుటుంబమని వ్యాఖ్యలు చేశారు. రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారో ఫామ్‌హౌస్‌లో కూర్చున్న వారికి తెలియాలన్నారు. కల్వకుంట్ల కుటుంబం మాటలు తీయగా ఉంటాయి కానీ.. గొంతులు కోసే కుటుంబమన మండిపడ్డారు. బంగారు తెలంగాణలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కౌలు రైతులకు కేసీఆర్ అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కల్తీ విత్తనాలకు గులాబీ దండే కారణమన్నారు. రైతులపై ఎన్ని కేసులు పెట్టారో కేసీఆర్ చెప్పాలన్నారు. రైతుల కోసమే పుట్టిన అంటివి కేసీఆర్.... ఉచిత ఎరువులు ఏమయ్యాయి అంటూ ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పేందుకు కేసీఆర్ పుట్టారన్నారు. ప్రగతి భవన్‌లో మాత్రమే 24 గంటల కరెంట్ ఉందన్నారు. కేసీఆర్ కుటుంబానికి కరెంట్ ఉంది కానీ.. రైతులకు 24



గంటల కరెంట్ లేదని తెలిపారు. ధరణి పోర్టల్ పేరుతో రైతులను ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేసీఆర్ చెప్పేవన్నీ అబద్ధాలే అని.. కేసీఆర్‌ను నమ్మవద్దని అన్నారు. నిజమైన రైతు సంక్షేమం బీజేపీతోనే సాధ్యమన్నారు. పోలీసులను పెట్టుకొని ప్రగతి భవన్ నుంచి కేసీఆర్ పాలన చేస్తున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజా ప్రగతి భవన్‌గా తీర్చిదిద్దుతామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.




హైదరాబాద్: తెలంగాణలోని పలు చోట్ల ఇవాళ కూడా అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. హైదరాబాద్‌లో నేడు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తీవ్ర అల్పపీడనం కొనసాగుతుందని.. మరికొన్ని గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం పలు జిల్లాలో భారీ వర్షాలు, హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నేడు రెడ్ అలర్ట్.. శుక్రవారం ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**గచ్చిబౌలి-లింగంపల్లి మార్గాల్లో వాహనాల మళ్లింపు :** హైదరాబాద్‌లో బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. దీంతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఖైరతాబాద్‌లోని మింట్ కాంపౌండ్ రహదారి, ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్, ఖైరతాబాద్ ప్రధాన రహదారిలోని మెట్రో స్టేషన్ వద్ద భారీగా నీరు నిలిచింది. రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో.. వాహనదారులు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. లింగంపల్లి రైల్వే అండర్ పాస్ వద్దకు భారీగా వరద నీరు చేరింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. గచ్చిబౌలి-లింగంపల్లి మార్గాల్లో వాహనాలను మళ్లించారు.

**రహదారులన్నీ జలమయం** : సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, చిలకలగూడ, ప్యాట్నీ, ప్యారడైజ్, బేగంపేట్, అల్వాల్, తిరుమలగిరి జవహర్‌నగర్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులన్నీ జలమయం అయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు పొంగి పొర్లుతూ ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. మూసారాంబాగ్ వంతెన వద్ద మూసీ నది ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తోంది. వంతెన అంచుకు వరదనీరు చేరింది.

సికింద్రాబాద్‌లోని మనోహర్ థియేటర్ సమీపంలో మోకాళ్ల తోతులో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది రంగంలోకి సహాయక చర్యలు చేపడుతున్నారు.

**ఇళ్లలోకి వర్షపు నీరు :** ఎల్బీనగర్ పరిధి నాగోల్ డివిజన్‌లోని అయ్యప్పకాలనీలో రాత్రి కురిసిన వర్షానికి ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. సాగర్ రింగ్ రోడ్డులో భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. హస్తినాపురం సమీపంలోని ఓంకార్ నగర్ బస్టాప్ సమీపంలోకి వరద నీరు చేరింది.

**నీట మునిగిన వాహనాలు :** బషీర్‌బాగ్ లా కాలేజీ రహదారి, వంతెన కిందకు భారీగా వర్షం నీరు నిలిచింది. మోకాళ్ల లోతు నీరు చేరడంతో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారుల పక్కన నిలిపిన వాహనాలు నీట మునిగాయి.




భారీ వర్షాలతో వరంగల్ నగరం అతలాకుతలమైంది. భద్రకాళి ఆలయం వద్ద అయ్యప్పస్వామి గుడిలోకి వరద పోటెత్తింది. హనుమకొండ-వరంగల్ రహదారి వంతెన పైనుంచి వరద ప్రవహిస్తోంది. వరంగల్ అండర్ రైల్వే బ్రిడ్జి కింద వరద నిలిచింది. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి జలదిగ్బంధమైంది. పంతిని వద్ద ఊర చెరువు ఉప్పొంగడంతో రోడ్డుపై వరద ప్రవహిస్తోంది. కాడారిగూడె చెరువు కూడా రహదారిపై ప్రవహిస్తోంది. మైలారం వద్ద భారీ చెట్టు కూలి అధిక సంఖ్యలో వాహనాలు నిలిచాయి. మరో రెండు రోజులు జిల్లా వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించడంతో.. అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు.

## మహిపాల్ రెడ్డి ఇంట తీవ్ర విషాదం.. ఆయన కుమారుడి కన్నుమూత

హైదరాబాద్ : బీఆర్ఎస్ పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంట తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆయన పెద్ద కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి నేడు మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విష్ణువర్ధన్ రెడ్డి నేటి తెల్లవారుజామున చికిత్స పొందుతూ మృతి చెందారు. మూడు రోజుల క్రితం విష్ణువర్ధన్ రెడ్డి అనారోగ్యానికి గురవడంతో కుటుంబ సభ్యులు ఆయనను కాంటినెంటల్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆయనకు అక్కడి వైద్యులు చికిత్సను అందిస్తున్నారు. అయితే గత అర్ధరాత్రి తరువాత నుంచి ఆయన ఆరోగ్యం మరింత విషమించింది. దీంతో విష్ణువర్ధన్ రెడ్డి చికిత్స పొందుతూ నేటి తెల్లవారుజామున 2:30 గంటలకు మృతి చెందారు. దీంతో ఆయన కుటంబం తీవ్ర విషాదంలో



మునిగిపోయింది. కాగా.. విష్ణువర్ధన్ రెడ్డి మృతికి పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు సంతాపం ప్రకటిస్తున్నారు.

## సొంత పార్టీ నేతలే టార్గెట్‌గా వరుస ట్వీట్లు.. బీజేపీలో హాట్ టాపిక్‌గా విజయశాంతి



హైదరాబాద్ : సొంత పార్టీ నేతలే టార్గెట్‌గా బీజేపీ నాయకురాలు విజయశాంతి వరుస ట్వీట్లు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం విజయశాంతి వ్యవహారం వాత పెట్టి.. వెన్న పూసిన మాదిరిగా ఉందని బీజేపీ నేతలు అంటున్నారు. బీజేపీ ఎన్నికల మేనేజ్మెంట్ కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్ ను ఉద్దేశించే విజయశాంతి ట్వీట్స్ చేస్తున్నారని పార్టీలో చర్చ జరుగుతోంది. ఇప్పటికీ పార్టీలో కొంత మంది హైకమాండ్ కు ఫిర్యాదులు చేయటమే పనిగా పెట్టుకున్నారని విజయశాంతి మండిపడుతున్నారు. ఫిర్యాదులను బంద్ చేయకుంటే పార్టీకి తీవ్ర నష్టమన్న.. బండి సంజయ్ కామెంట్స్ ను ట్విట్టర్ ద్వారా రాములమ్మ హెచ్చరిస్తున్నారు. కిషన్ రెడ్డి నాయకత్వంలో బీజేపీ మంచి విజయాలు సాధించాలని కోరుకుంటునట్లు తెలిపారు. మొత్తానికి బీజేపీలో విజయశాంతి వరుస ట్వీట్స్ గందరగోళంగా మారాయి.

మణిపూర్ ఘటనపై కూడా విజయశాంతి ట్విటర్ వేదికగా కాస్త ఘాటుగానే స్పందించారు. బీజేపీ ప్రభుత్వమే ఉన్న మణిపూర్‌లో జరుగుతున్న దారుణమైన ఘటనపై బీజేపీ కీలక నేతలెవ్వరూ పెదవి విప్పడం లేదు. విజయశాంతి మాత్రం అక్కడి బీజేపీ ప్రభుత్వంపైనే విమర్శలు గుప్పించడం గమనార్హం. మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలు యావత్ దేశాన్ని త్రీవ్ర వేదనకు గురిచేస్తున్నాయన్నారు. సభ్యసమాజం సిగ్గుతో బాధపడుతోందని రాములమ్మ పేర్కొన్నారు.

అంతేకాకుండా మహిళ విషయంలోని నేరస్థులను ఉరి తీసి శిక్షించాలని డిమాండ్ కూడా చేశారు.మొత్తానికి విజయశాంతి సొంత పార్టీపైనే తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఆమె పార్టీ మారుతారన్నట్టుగా కూడా ప్రచారం జరుగుతోంది.

## తెలంగాణలో దంచికొడుతున్న వానలు.. పోలీసులకు డీజీపీ కీలక ఆదేశాలు

హైదరాబాద్: తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర పోలీస్ విభాగం అప్రమత్తమైంది. రానున్న 48 గంటల్లో భారీ వర్షాలు పడనున్నాయని అప్రమత్తంగా ఉండాలని డీజీపీ అంజనీ కుమార్ హెచ్చరించారు. భారీ వర్షాల నేపథ్యంలో గురువారం రాష్ట్రంలో జిల్లాల పోలీస్ అధికారులతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పోలీస్ యంత్రాంగాన్ని డీజీపీ అప్రమత్తం చేశారు. తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై పోలీస్ కమీషనర్లు, ఎస్పీలతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 24 గంటలు అందుబాటులో ఉండాలని సిబ్బందికి ఆదేశించింది. సహాయం కోసం డయల్ 100కు లేదా స్థానిక పోలీసు పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు పూర్తిగా నిండాయని, ఈ జలాశయాల వద్దకు ఎవరు వెళ్లకుండా తగు ముందు జాగ్రత చర్యలు చేపట్టాలని డీజీపీ ఆదేశించారు. వరద ఉధృతితో తెగిపోయిన రోడ్లు, ఉధృతంగా ప్రవహించే కాజ్ వేల వద్దకు ప్రజలు వెళ్లకుండా, రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్, బారిగేడ్స్, హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చర్లలోని లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఉపయోగించుకోవాలని డీజీపీ సూచించారు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని.. వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను గానీ చేతులతో తాకకుండా, ఇతర జాగ్రత్త చర్యలపై ప్రజలను చైతన్య పర్చాలని సిబ్బందికి ఆదేశించారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదని సూచించారు. జలపాతాలు, నిండిన చెరువుల మత్తళ్ల వద్దకు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు చేపట్టాలని డీజీపీ అంజనీకుమార్ ఆదేశాలు జారీ చేసింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com